

టమోటా రైతుకు ఊరట

క్రమేపీ పెరుగుతున్న ధరలు



పలమనేరు యార్డులో టమోటాల గ్రేడింగ్

పలమనేరు/సోమల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మార్కెట్‌లో మూడు రోజులుగా పెరుగుతున్న టమోటా. ధరలతో రైతులు ఊరట చెందుతున్నారు. ఆరు నెలలుగా ధరలు లేక కొందరు రైతులు తోటల్లోనే టమోటాలను కోయకుండా వదిలేస్తున్నారు. మరికొందరు రోడ్లపక్కన పారపోసి వెళ్లిపోతున్నారు. టమోటా బాక్సు కేవలం రూ. 40నుంచి 80కే పరిమితమవుతూ వచ్చింది. అనూహ్యంగా ఈనెల 7న ఇక్కడి మార్కెట్‌లో బాక్సు ధర రూ. 170కి పెరిగింది. మర్నాడు అంటే ఆదివారం బాక్సు ధర రూ. 220కి చేరుకొంది. సోమవారం రూ. 350 పలికింది. ఇన్నాళ్లూ నిరాశ చెందిన రైతుల ముఖాల్లో ఆనందం కనిపిస్తోంది. ఈ ధరలు కొనసాగితే పెట్టుబడి ఖర్చులకు ఢోకా ఉండదని రైతులంటున్నారు. కర్ణాటక, మహారాష్ట్రల్లో విపరీతంగా కురిసిన వర్షాలకు టమోటా పంట పూర్తిగా తుడిచిపెట్టుకుపోవడంతో ఇక్కడ ధరలు క్రమేపీ పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. పుంగనూరు, కోలారు, కలికిరి, కలకడ మార్కెట్లలో 15కిలోల టమోటా బాక్సు రూ. 250 నుంచి రూ. 300 వరకు చేరుకుంది. రెండో రకం రూ. 150 నుంచి రూ. 200కు చేరుకుంది. దీంతో తోటల్లో వదిలేసిన కాయలను కూడా కోసి మార్కెట్‌కు తరలిస్తున్నారు. నాణ్యత లేని కాయల బాక్సు సైతం రూ.100 పలుకుతోంది. మార్చిలో నాటిన టమోటా తోటల్లో కాయలు మార్కెట్‌కు వస్తున్నాయి. ఏప్రిల్ మొదటి వారం నాటిన టమోటా తోటల్లో కోతలకు సిద్ధంగా ఉన్నాయి.



డీసీవోగా లక్ష్మి

నాగవర్ధన తిరుపతికి బదిలీ

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 9(ఆంధ్రజ్యోతి):చిత్తూరు జిల్లా సహకార శాఖ అధికారిణిగా తిరుపతి డీసీవో ఎస్. లక్ష్మి నియమితులయ్యారు.ఇక్కడ పనిచేస్తున్న ఎస్వీ నాగవర్ధనను తిరుపతి జిల్లాకు బదిలీ చేస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ అయ్యాయి



యోగాసనాలు వేస్తున్న ప్రజలు


యోగాలో దిక్సూచి భారత్



ప్రజలతో కలిసి యోగాసనాలు వేస్తున్న మంత్రి, కలెక్టర్, ఎస్పీ

చౌడేపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): యోగాలో ప్రపంచానికే భారత్ దిక్సూచిగా నిలిచిందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం బోయకొండలో 2వేల మందితో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు గోశాల సమీపం నుంచి షాపింగ్ కాంప్లెక్స్ వద్ద ప్రధాన రహదారి వరకు వివిధ శాఖల అధికారులు, ప్రజలు యోగాసనాలు వేశారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో 10 లక్షల మందికి యోగాపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ రోజూ అరగంట పాటు యోగా, ధ్యానం, వ్యాయాయం చేస్తే చాలా రకాల జబ్బుల నుంచి దూరంగా ఉంటామన్నారు. కొంత సేపు ఎండలో ఉంటే డీ విటమిన్‌తో పాటు ఖర్చు లేకుండా వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ యోగా జీవితంలో భాగంగా మార్చుకుంటే ఆరోగ్యంగా ఉంటామన్నారు.టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, జిల్లా టూరిజం అధికారిణి గౌరి, డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, ఆర్‌డీవో భవాని తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర ప్రతిష్టాత్మకం



నేటినుంచి గుజ్జు పరిశ్రమల వద్ద ఉద్యోగ బృందాలు

మండలానికో పర్యవేక్షణ అధికారి

ఒకట్రెండు రోజుల్లో ర్యాంపుల వద్దా బృందాల నియామకం

బయటి కాయలు రాకుండా చెక్‌పోస్టుల్లోనూ ప్రత్యేక అధికారులు

చిత్తూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు న్యాయం చేసేందుకు మద్దతు ధర అమలు విషయాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ప్రతి రైతుకూ మామిడి గుజ్జు పరిశ్రమలు ఇచ్చే రూ.8తో పాటు ప్రభుత్వం ఇచ్చే రూ.4 సబ్సిడీ కచ్చితంగా అందాలనే లక్ష్యంతో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం ప్రణాళికాబద్ధంగా ముందుకెళుతోంది. ఇప్పటికే జిల్లాలో మామిడి కొనుగోళ్లు ప్రారంభమవగా, మంగళవారం నుంచి జిల్లాలోని 35 ఫ్యాక్టరీల వద్ద ఇప్పటికే నియమించిన ప్రభుత్వ ఉద్యోగుల బృందాలు పనిచేయనున్నాయి. రైతుల వివరాలు ఎలా నమోదు చేసుకోవాలి.. ఎలా పర్యవేక్షణ చేయాలి.. వంటి అంశాలపై సోమవారం కలెక్టరేట్‌లో అవగాహన కల్పించారు.

● **రెండు షిఫ్టుల్లో పనిచేసేలా..**

జిల్లాలోని 70 శాతం మంది రైతులకు తమ కాయల్ని ఫ్యాక్టరీలకు తరలించడం అలవాటు. ర్యాంపులకు, మార్కెట్ యార్డులకు తీసుకెళ్లేవారి సంఖ్య తక్కువ. అందుకే తొలి విడతలో ఫ్యాక్టరీల వద్ద సిబ్బందిని నియమించారు. ఒకట్రెండు రోజుల్లో ర్యాంపుల వద్దా నియమించనున్నారు. ఫ్యాక్టరీల వద్ద నియమించిన ఉద్యోగులు రెండు విడతలుగా పనిచేస్తారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓ బృందం, అప్పటి నుంచి రాత్రి 8 గంటల వరకు మరో బృందం పని చేయనుంది.ఈ బృందంలో ఓ వీఆర్వో, ఓ అగ్రికల్చర్/హార్టికల్చర్ అసిస్టెంట్ ఉంటారు. ఫ్యాక్టరీల వద్ద రోజంతా నమోదు చేసుకున్న వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా అధికారులకు వీరు నివేదించాల్సి ఉంటుంది.

● **నాలుగు మండలాలకు ప్రత్యేక అధికారులు**

ఫ్యాక్టరీల వద్ద రోజంతా పర్యవేక్షణ చేయడానికి అగ్రికల్చర్/హార్టికల్చర్ ఆఫీసర్లు, డిప్యూటీ తహసీల్దార్, ఈవోపీఆర్డీ, ఏఈ.. వంటి మండల స్థాయి అధికారులను నియమించారు. అలాగే ప్రతి మండలానికీ ఓ జిల్లా అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు. ఎక్కువ ఫ్యాక్టరీలున్న మండలాలకు కీలకమైన జిల్లా అధికారుల్ని కేటాయించారు. తవణంపల్లె మండలానికి జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, జీడీనెల్లూరుకు డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, గుడిపాలకు చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, పూతలపట్టుకు డీపీవో సుధాకర్‌లను నియమించారు.

● **సరిహద్దు చెక్‌పోస్టుల్లోనూ సిబ్బంది నియామకం**

మన జిల్లాలోని తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లోకి చెక్‌పోస్టుల్లో మామిడి సీజన్ అయిపోయే వరకు పనిచేసేలా సిబ్బందిని నియమించారు. రెవెన్యూ, పోలీసు, ఫారెస్టు, మార్కెటింగ్ శాఖల సిబ్బంది ఆయా చెక్‌పోస్టుల్లో పనిచేసి, బయటి ప్రాంతాలనుంచీ మామిడి కాయలు రాకుండా అడ్డుకుంటారు. తిరుపతి, అన్నమయ్య జిల్లాల కాయల్ని మాత్రం అనుమతిస్తారు.

● **కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

మద్దతు ధర అమలును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కలెక్టర్ సుమిత్ కుమార్, కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను కూడా ఏర్పాటుచేశారు. ఇక్కడ హార్టికల్చర్ డీడీ మధుసూదన రెడ్డి, డీఎల్‌డీవో రవికుమార్, డీఆర్‌డీఏ ఏపీడీ రవిలతో పాటు ఆడిట్ బృందం ఇక్కడ పనిచేస్తుంది. రోజువారి మామిడి కాయల రాక, అమ్మకాలను ఫాలోఅప్ చేసి, రైతుల సమస్యల్ని కూడా నోట్ చేసుకుంటారు.

● **పక్వానికి రాని కాయల్నీ తరలిస్తున్న రైతులు**

ప్రభుత్వం సబ్సిడీ ప్రకటించడంతో చాలామంది రైతులు కాయలు పక్వానికి రాకముందే కోసి ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. సోమవారం రెండు ఫ్యాక్టరీల నుంచి హార్టికల్చర్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. సబ్సిడీ అనేది ఈ సీజన్ అయిపోయేవరకు అమలులో ఉంటుంది. దీంతో దశల వారీగా కాయల్ని కోయాలని ఆయా అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

● **ఫ్యాక్టరీల వద్దకు రైతులే వెళ్లాలి**

ఇంతకాలం కాయల్ని ఫ్యాక్టరీలకు తరలించేటప్పుడు రైతులు తెలిసిన వాళ్లను పంపించేవారు. ఇప్పుడుప్రభుత్వం సబ్సిడీ ఇస్తుండడంతో రైతులే స్వయంగా ఫ్యాక్టరీల వద్దకు వెళ్లి అక్కడి ప్రభుత్వ ఉద్యోగుల వద్ద తమ వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. పేరు, ఆధార్, బ్యాంకు అకౌంట్, ఎన్ని టన్నుల కాయలు.. వంటి వివరాలను ఎంటర్ చేయించాలి. ఒక్కో ట్రాక్టర్‌లో 5 టన్నుల కాయలుంటాయి. వివరాలు నమోదు చేసుకోకుంటే కిలోకు రూ.4 సబ్సిడీ చొప్పున రూ.20 వేలు నష్టపోతారు.

ఈ 15 రోజులు కీలకం: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఈ మామిడి సీజన్‌లో రానున్న 15 రోజులు చాలా కీలకమని, ప్రభుత్వం తోతాపురి మామిడికి మద్ధతు ధర ప్రకటించిన నేపథ్యంలో పర్యవేక్షణకు నియమించిన అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్‌కుమార్, ఉద్యానశాఖ అధికారి మధుసూదన్‌తో కలిసి ప్రాసెసింగ్ కంపెనీల వద్ద విధులు కేటాయించిన అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మద్ధతు ధర పూర్తిస్థాయిలో రైతులకు న్యాయం జరిగేలా జిల్లాయంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేపడుతోందన్నారు.ప్రభుత్వం ప్రకటించిన రూ. 4 మద్ధతు ధర వివరాలను ప్రాసెసింగ్ కంపెనీల దగ్గర బోర్డుల్లో ప్రదర్శించాలన్నారు.ఫ్యాక్టరీలకు వచ్చిన మామిడి రకం తోతాపురియా కాదా అని పరిశీలించడంతో పాటు ప్రాసెసింగ్ కంపెనీలకు వచ్చిన రైతుల పూర్తి వివరాలు, గ్రామం, మండలం, వాహన నెంబరు, క్వాంటిటీ, ఆధార్ నెంబరు, బ్యాంకు ఖాతా నెంబరు, ఫోన్ నెంబరు తదితర వివరాలను ప్రొఫార్మాలో పూర్తిచేసి ఫ్యాక్టరీ యాజమాన్యాలకు అందించాలన్నారు.ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఉద్యాన, రైతుసేవ, రెవిన్యూ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



సాక్షి కార్యాలయం ముందు టీడీపీ నాయకుల నిరసన

మహిళలకు మీరిచ్చే గౌరవం

ఇదేనా?

సాక్షి కార్యాలయం వద్ద కూటమి నేతల ఆందోళన.. ఉద్రిక్తత

రేణిగుంట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): 'అమరావతి మహిళల గురించి సాక్షి ఛానల్‌లో జరిగిన చర్చను చూస్తే చాలు. మహిళలకు మీరిచ్చే గౌరవం ఏపాటిదో అర్థమవుతుంది' అని జగన్‌ను ఉద్దేశించి కూటమి నేతలు పేర్కొన్నారు. ఆ ఛానల్ చర్చలో వాడిన అసభ్యపదజాలాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం సాయంత్రం రేణిగుంట సమీపంలోని సాక్షి ఎడిషన్ కార్యాలయం ఎదుట కూటమి నాయకులు, మహిళలు ఆందోళనకు దిగారు. మాజీ సీఎం జగన్, ఆ ఛానల్ అధినేత భారతిరెడ్డి వెంటనే అమరావతి మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒక దశలో ఆగ్రహావేశాలు తట్టుకోలేక సాక్షి కార్యాలయం వైపు రాళ్లు రువ్వారు. మహిళలు లోపలకు చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని నిలువరించారు. ఏపీజీబీసీ చైర్‌పర్సన్, సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం తదితరులు మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన విజయవంతంగా పూర్తి చేసుకోవడంతో వైసీపీ నాయకులు కుట్ర ప్రకారం బురదజల్లేందుకు సోషల్ మీడియా వేదికగా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.ఆందోళనకారులపై సాక్షి ఉద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భారతీరెడ్డి, జగన్‌లదే బాధ్యత



ఆంధ్రుల రాజధాని అమరావతిపై కృష్ణం రాజు వ్యాఖ్యలు బేస్‌లెస్ అండ్ సెన్స్ లెస్. ఇలాంటి పనికిమాలిన కామెంట్స్ ఎవరు చేసినా క్షమించకూడదు. సాక్షి చానెల్ డిబేట్‌లో కామెంట్స్ వచ్చాయి కాబట్టి భారతీరెడ్డి, జగన్ బాధ్యత వహించి క్షమాపణ చెప్పాలి.

- చిత్తూరులో పీసీసీ చీఫ్ షర్మిలారెడ్డి

సోషల్ మీడియా ఉచ్చులో పడొద్దు

షైనింగ్ స్టార్ అవార్డుల సభలో మంత్రి పిలుపు




విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

చిత్తూరు సెంట్రల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా ఉచ్చులో పడకుండా ఉత్తమ పౌరులుగా ఎదిగి, సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని విద్యార్థులకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. టెన్త్‌లో ఉత్తమ మార్కులు సాధించిన 190మందికి, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన 33మందికి చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో సోమవారం షైనింగ్ స్టార్ పేరిట మెడల్స్, ప్రశంసా పత్రాలు, రూ.20వేల చొప్పున నగదు బహుమతులు మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షైనింగ్ స్టార్ అవార్డుల ప్రదానం ఏటా జరుగుతుందని చెప్పారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు థామస్, జగన్మోహన్, మురళీమోహన్ తదితరులు మాట్లాడుతూ ప్రైవేటు బడులకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో మంత్రి నారా లోకేష్ పనిచేస్తున్నారని, అందులో భాగంగానే షైనింగ్ స్టార్ అవార్డులిచ్చి ప్రోత్సహిస్తున్నారన్నారు.చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ ఆముద, డీఈవో వరలక్ష్మి, డిప్యూటీమేయర్ రాజేష్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు రాజన్, పుంగనూరు ఇన్‌చార్జి చల్లాబాబు, నాయకులు కాజూరు బాలాజీ, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.



అవార్డుల ప్రదానోత్సవ సభకు హాజరైన విద్యార్థులు



తెప్పపై పద్మావతీదేవి అభయం



తిరుచానూరు, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి తెప్పోత్సవాల్లో భాగంగా మూడవ రోజు సోమవారం పద్మసరోవరంలో అమ్మవారు తెప్పపై విహరించి భక్తులకు అభయమిచ్చారు. సాయంత్రం 6.30గంటలకు ఉత్సవమూర్తిని పద్మపుష్కరిణి వద్దకు వేంచేపు చేసి పూజలు నిర్వహించి తెప్పపై అధిష్ఠింపచేశారు. అనంతరం పుష్కరిణిలో మూడు చుట్లు అమ్మవారు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అనంతరం నాలుగు మాడ వీధుల గుండా ఊరేగుతూ ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు, అర్చకులు పాల్గొన్నారు. తెప్పోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి గజవాహన సేవ జరగనుంది.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 2 షెడ్లు సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.73 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 90,802

తలనీలాలు సమర్పించినవారు: 35,776



మహారథంపై గోవిందుడు






తిరుపతి అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): భక్తజన సందోహం మధ్య సోమవారం ఉదయం తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి మహారథోత్సవం జరిగింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఎనిమిదవ రోజు ఉదయం 6.15గంటలకు ప్రారంభమైన రథోత్సవం కర్నాలవీధి, బేరివీధి, గాంధీరోడ్డుల మీదుగా యథాస్థానమైన రథమండపానికి చేరుకుంది. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై గోవిందనామ స్మరణలతో రథాన్నిలాగారు. ఆ సమయంలో ట్రాఫిక్‌ను మళ్లించి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పకడ్బందీ ఏర్పాట్ల మధ్య మహారథోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించగా, రాత్రి అశ్వవాహనంలో స్వామివారు భక్తులను కటాక్షించారు. ఉత్సవాలలో జీయ్యంగార్లు, ఎఫ్ఏఅండ్ సీఏవో బాలాజీ, ఎస్ఈ 2 జగదీశ్వర్‌రెడ్డి, డిప్యూటీఈవో శాంతి, ఇతర ఇంజనీరింగ్ అధికారులు, భక్తులు పాల్గొన్నారు. కాగా మంగళవారం ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంతో గోవిందుడి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కానున్నాయి.

గత నెల 1757.. ఇప్పుడు 3307 యూనిట్లు

అదానీ స్మార్ట్ మీటర్లతో హడలిపోతున్న విద్యుత్తు వినియోగదారులు



అదానీ స్మార్ట్ మీటర్ బిగించాక వచ్చిన విద్యుత్ బిల్లు, ముందు వస్తున్న బిల్లు స్టేట్‌మెంట్

పాకాల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): అదానీ స్మార్ట్ మీటర్లతో విద్యుత్ వినియోగదారులు హడలిపోతున్నారు. స్మార్ట్ మీటర్లు బిగించాక రెట్టింపు బిల్లులు వస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ వినియోగం పెరగకున్నా బిల్లులు అధికమొత్తంలో వస్తుండడంతో చార్జీల భారం మోయలేమని వాణిజ్య, పరిశ్రమల విద్యుత్ వినియోగదారులు అంటున్నారు. ఇటీవల పాకాల మండలంలో వాణిజ్య వినియోగదారులకు అదానీ స్మార్ట్ మీటర్లు అమర్చారు. ఈ నెలలో వచ్చిన బిల్లులు చూసి లబోదిబోమంటున్నారు. ఉదాహరణకు పాకాల ఆపరేషన్ పరిధిలో త్రీ ఫేజ్ వాణిజ్య సర్వీసు నెం.5426111005115 గత 23 నెలల్లో విద్యుత్ వినియోగం సరాసరి నెలకు 1617 యూనిట్లు వినియోగమైంది. అత్యధికంగా ఒక నెలలో 25,963 రూపాయలు, అత్యల్పంగా ఒక నెలలో 16,732 రూపాయలు బిల్లు చెల్లించారు. స్మార్ట్ మీటర్ బిగించకముందు ఏప్రిల్ నెలలో 1757 యూనిట్లు వినియోగించి రూ.23,326 బిల్లు చెల్లించారు. స్మార్ట్ మీటరు బిగించాక మే నెలకు సంబంధించి ఒక్కసారిగా 3,307 యూనిట్లు వినియోగించారని, రూ.38,136 చెల్లించాలని బిల్లు వచ్చింది. వాడకం పెరగకపోయినా స్మార్ట్ మీటర్‌తో 1550 యూనిట్లు అదనంగా బిల్లులో చూపించి గత నెలకంటే రూ.14,810 ఎక్కువ రావడంతో వ్యాపారం ఎలా కొనసాగించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత మీటరు ఉన్నప్పుడు పవర్ ఫ్యాక్టర్ 0.91, 0.88 వుండగా అదానీ స్మార్ట్ మీటర్‌తో పవర్ ఫ్యాక్టర్ 0.4 వచ్చింది. దీంతో యూనిట్లు పెరిగి బిల్లు అధిక మొత్తంలో వచ్చినట్లు తెలుస్తోంది. పాతమీటర్లతో రూ.300-400 వచ్చే బిల్లులు స్మార్ట్ మీటర్లతో 800-1000ల వరకు వస్తున్నాయని చిరువ్యాపారులు వాపోతున్నారు. స్మార్ట్ మీటర్ల పనితీరును పరిశీలించకనే పాత మీటర్ల స్థానంలో బిగించి వినియోగదారులను ఇబ్బంది పెడుతున్నారు. అదానీ స్మార్ట్ మీటర్లు తొలగించి పూర్వం వున్న మీటర్లను బిగించాలని విద్యుత్ వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

10 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 10 మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. మండలాలవారీగా నింద్రలో 48.4, కుప్పంలో 9.2, గుడిపాలలో 8.8, పెద్దపంజాణిలో 8.2, నగరిలో 5.6, చిత్తూరులో 4.2, గుడుపల్లిలో 3.4, బైరెడ్డిపల్లిలో 1.4, గంగవరంలో 1.2, పలమనేరులో 1.0 మిమీ వర్షపాతం నమోదైంది.

డీఈవో పూల్ అనే అసంబద్ధతను తొలగించండి



రాష్ట్ర విద్యా భవన్ ముందు నిరసన తెలుపుతున్న భాషోపాధ్యాయులు

చిత్తూరు సెంట్రల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): డీఈవో పూల్ అనే అసంబంద్ధతను తొలగించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం రాష్ట్ర విద్యాభవన్ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2017లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భాషోపాధ్యాయుల ఉన్నతీకరణ కోసం జీవో 91 తీసుకురాగా, 2019లో సవరించి 77 జీవోను ఇచ్చారన్నారు. ఇందులో అర్హత లేని 1300మంది ఎస్టీటీలకు పదోన్నతులు ఇవ్వడం ద్వారా భాషా పండితులు డీఈవో పూల్‌లోకి వెళ్లినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీని ద్వారా పని సర్దుబాటు కింద దూర ప్రాంతాలకు వెళ్లడంతో పాటు ఎక్కడ పనిచేస్తున్నాం, ఎక్కడ జీతం తీసుకోవాలనే దానిపై గందరగోళం నెలకొందన్నారు. డీఈవో పూల్లోని ఉపాధ్యాయులకు ఇప్పటికైనా న్యాయం చేసి, నిర్ణీత ప్రదేశంలో విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజుకు విన్నవించారు. నిరసనలో సంఘం నేతలు చందు, శ్రీరాములు, భానుప్రకాష్ తదితరులు ఉన్నారు.

వజ్రకవచంలో మలయప్ప




జ్యేష్ఠాభిషేకం తొలిరోజు సోమవారం సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామి వజ్రకవచంలో దర్శనమిచ్చారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఉత్సవమూర్తులకు వజ్రకవచాన్ని అలంకరించి సహస్రదీపాలంకార సేవలో కొలువుదీర్చారు. సేవ అనంతరం స్వామివారు నాలుగమాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ఏడాదిలో ఒక్కసారే ఈ వజ్రకవచంలో దర్శనమివ్వడం గమనార్హం. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీఈవో లోకనాథం తదితరులు పాల్గొన్నారు. ఇక, మంగళవారం ముత్యపు కవచం, బుధవారం స్వర్ణకవచంతో స్వామి, అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

అలిపిరిలోనే దేవుడు కనిపిస్తున్నాడు

రోజురోజుకు పెరుగుతున్న వాహనరద్దీ ● చెక్‌పాయింట్‌లోనే గంటల కొద్దీ క్యూలైన్లలో నిరీక్షణ



తిరుమల, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తిరుమలకు చేరుకోకముందే శ్రీవారి భక్తులకు అలిపిరిలోనే దేవుడు కనిపిస్తున్నాడు. దర్శనానికే కాకుండా తనిఖీలకూ ఇంతేసి సమయం వాహనాలల్లో నిరీక్షించాల్సి వస్తోంది. తిరుమలకు ముఖద్వారమైన అలిపిరి సప్తగిరి తనిఖీ కేంద్రంలో తిరుమలకు వెళ్లే ప్రతి వాహనాన్ని, భక్తులను, లగేజీని తనిఖీ చేస్తుంటారు. ఇక్కడ 12 లైన్లు ఉన్నాయి. ఇందులో ఒక లైన్‌ను వీఐపీల కోసం, మరో రెండు లైన్లను ద్విచక్ర వాహనాల కోసం కేటాయించారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య చెక్ పాయింట్ నుంచి గరుడ సర్కిల్ వరకు వాహనాలు భారీగా నిలిచిపోతున్నాయి.

ఇవీ కారణాలు..

వాహనాలు భారీగా నిలిచిపోవడానికి వివిధ రకాల కారణాలు కనిపిస్తున్నాయి. కొవిడ్ ముందు వరకు రోజుకు 7,500 నుంచి 8 వేల వరకు వాహనాలు తిరుమలకు వచ్చేవి. కొవిడ్ సమయంలో పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు కన్నా ప్రయివేటు వాహనాల్లో ప్రయాణం క్షేమమని భావించారు. అదే ఇప్పటికీ కొనసాగుతోంది. గ్రామాల నుంచి కూడా కొందరు కలిసి ట్యాక్సీ మాట్లాడుకుని రావడానికి అలవాటు పడ్డారు. దీంతో ప్రస్తుతం సాధారణ రోజుల్లో 9 వేలు, రద్దీరోజుల్లో 10 వేల వాహనాలు తిరుమలకు చేరుకుంటున్నాయి. దీంతో పాటు 2022లో ఏర్పాటు చేసి స్కానర్లలో చాలా వరకు సక్రమంగా పనిచేయడం లేదు. ఇందువల్ల ఆలస్యమవుతున్నట్టు అధికారులు గుర్తించారు. తనిఖీల విధుల్లో ఎస్పీఎఫ్ సిబ్బంది 35 నుంచి 40 మంది, విజిలెన్స్ సిబ్బంది 24 మంది ఉంటారు. ఈ సంఖ్య సరిపోవడం లేదు.

విస్తరణపై దృష్టి

అలిపిరి తనిఖీ కేంద్రాన్ని మరింత విస్తరించడం తప్ప మరోదారి లేదని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతమున్న 12 లైన్లను 14 లైన్లుగా మార్చడం ఇందులో ఒకటి. అలాగే అత్యాధునిక స్కానర్లు, సిబ్బంది పెంపు, వారికి ప్రత్యేక శిక్షణ వంటి వాటిపై కూడా చర్యలు తీసుకోవాలని అనుకుంటున్నారు. ఇవి అమలైతే అలిపిరిలో నిరీక్షణ సమయం తగ్గే అవకాశం ఉంది.



సింహ వాహనంపై ప్రసన్న వేంకటేశ్వరుడు

సింహ,ముత్యపు పందిరి వాహనాలపై

శ్రీనివాసుడి విహారం

వడమాలపేట, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): వడమాలపేట మండలం అప్పలాయగుంటలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం సింహ వాహనంపై స్వామివారు నరసింహస్వామి అలంకారంలో ఊరేగారు. అనంతరం పద్మావతీ అండాల్ సమేతంగా స్వామివారికి స్నపనతిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం ఊంజల సేవ జరిగింది. రాత్రి భోగశ్రీనివాస మూర్తిగా స్వామివారు ముత్యపుపందిరి వాహనంపై ఆశీనుడై మాడవీధుల్లో ఊరేగారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం 4.30-6.30 గంటల మధ్య ఆర్జిత కల్యాణోత్సవం నిర్వహిస్తున్నారు. భక్తులు రూ.500 చెల్లించి సంప్రదాయ దుస్తులతో పాల్గొనాల్సి ఉంది.



ముత్యపుపందిరి వాహనంపై ఊరేగుతున్న శ్రీనివాసుడు

ఎన్టీఆర్, ముద్దుకృష్ణమ కాంస్య విగ్రహాల ఆవిష్కరణ



ముద్దుకృష్ణమ విగ్రహ ఆవిష్కరణలో ఎమ్మెల్యే - ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తూ..

పుత్తూరు అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పుత్తూరులో ఏర్పాటు చేసిన టీడీపీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం ఎన్టీఆర్.. ముద్దుకృష్ణమ కాంస్య విగ్రహాలను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సోమవారం ఆవిష్కరించారు. ముద్దుకృష్ణమ 79వ జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు రెండు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహనేతల సేవలను స్మరించుకున్నారు. అనంతరం చిన్నారి చేతుల మీదుగా కేక్ కట్ చేయించి మహిళలకు పంచి పెట్టారు. అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భానుప్రకాష్ మాట్లాడుతూ.. ముద్దుకృష్ణమ సేవాతత్వం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజా సేవకుడిగా, నిరాడంబరతకు ప్రతీకగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. 1985లో విద్యాశాఖ మంత్రిగా ప్రతి గ్రామంలో ఒక పాఠశాల ఉండాలన్న సంకల్పానికి శ్రీకారం చుట్టారన్నారు. దీని ఫలితమే నాటి విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి నేడు పెద్ద పెద్ద స్థానాల్లో స్థిరపడడానికి దోహదపడిందన్నారు. ఆయన మరణించి ఏడేళ్లు కావస్తున్నా.. విగ్రహావిష్కరణకు పెద్ద సంఖ్యలో ప్రజలు, అభిమానులు రావడమే.. ప్రజల మదిలో ఆయన పదిలంగా నిలిచిపోయారనడానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్ష, కార్యదర్శులు గాలి జీవరత్నం నాయుడు, ఎన్.ఎన్.ధనపాల్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ వాసు, మున్సిపల్ మాజీ చైర్మన్ బీఆర్ యుగంధర్, గాలి గోపినాథ్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద ఘటనలో కారు యజమానిపై హత్యాయత్నం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గతంలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదానికి సంబంధించి కారు యజమానిపై గుర్తు తెలియని వ్యక్తులు సోమవారం హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన త్యాగరాజనగర్ వద్ద చోటు చేసుకుంది. డీఎస్పీ భక్తవత్సలం కథనం మేరకు.. చిత్తూరు జిల్లా ఎస్ఆర్ పురం ప్రాంతానికి చెందిన మెడికల్ రెప్రజెంటేటివ్ నిరంజన్ నాయుడు 2024లో చంద్రగిరి మండలం ఐతేపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో సోమవారం తిరుపతి కోర్టుకు హాజరయ్యారు. వాయిదా చూసుకుని తిరిగి కారులో వెళుతుండగా త్యాగరాజనగర్ వద్ద దుండగులు రాడ్లు, కత్తులతో అతడిపై దాడి చేశారు. తల, కాళ్లు, చేతులపై బలమైన గాయాలయ్యాయి. ఈ ఘటనలో నిందితులు పరారయ్యారు. దీనిపై బాధితుడు నిరంజన్ నాయుడు తిరుపతి వెస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేశారు. హత్యాయత్నానికి పాల్పడింది ఎవరు? అందుకుగల కారణాలేమిటనే విషయాలపై సీసీ ఫుటేజీలను పరిశీలించి నిందితులను అరెస్టు చేస్తామని డీఎస్పీ చెప్పారు.



గాయపడిన నిరంజన్

తిరుపతి డీపీటీవోగా జగదీష్



తిరుపతి(ఆర్టీసీ), జూన్ 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా ప్రజారవాణాధికారి (డీపీటీవో)గా ఎం.జగదీష్ పూర్తిస్థాయిలో నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ప్రస్తుతం ఆయన చిత్తూరు డీపీటీవోగా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు ఇక్కడున్న వెంకటరావును విజయవాడ డీపీటీవోగా బదిలీ చేశారు. అన్నమయ్యజిల్లా డీపీటీవోగా ఉన్న రాముకు చిత్తూరుజిల్లా ప్రజారవాణాధికారిగా ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. కాగా జగదీష్ ఈ వారంలో బాధ్యతలు తీసుకోనున్నట్లు విశ్వసనీయ సమాచారం.

బత్తినయ్య కోనకు 'కన్నప్ప' బృందం



మోహన్‌బాబు

ఏర్పేడు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం మునలిపేడు సమీపంలోని బత్తినయ్యస్వామి కోనకు సోమవారం 'కన్నప్ప' యూనిట్ వచ్చింది. ఈ సందర్భంగా మోదుగుల పాళెం, మునలిపేడు గ్రామస్తులు వీరికి ఘనస్వాగతం పలికారు. అనంతరం మోహన్‌బాబు, మంచు విష్ణు, శివబాలాజీ బత్తినయ్యస్వామి కోనకు వెళ్లి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కోలా ఆనంద్, షైలం దయాకర్, మంచు సుధాకర్‌నాయుడు, మంచు మస్తాన్‌నాయుడు, పులిపాటి చంద్రశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న మంచు విష్ణు, శివబాలాజీ

ప్రభుత్వ ఆదేశాలను లెక్కచేయని గుజ్జు పరిశ్రమల

లైసెన్సులను రద్దు చేయండి



కలెక్టరేట్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో సోమవారం వేర్వేరుగా పీజీఆర్ఎస్ కార్యక్రమాలు జరిగాయి. కలెక్టరేట్‌లో జేసీ విద్యాధరితో పాటు ఇతర అధికారులు వినతిపత్రాలను స్వీకరించారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ మణికంఠ, ఇతర అధికారులు అర్జీలు స్వీకరించారు. బాధితుల సమస్యలను విని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

● ప్రభుత్వ ఆదేశాన్ని లెక్క చేయని మామిడి గుజ్జు పరిశ్రమల లైసెన్సులను రద్దు చేయాలని మామిడి రైతు సంక్షేమ సంఘం నేతలు డిమాండ్ చేశారు. మామిడి రైతులకు మద్దతుగా రైతు సంఘం నేతలు ధర్నా చేశారు. సంఘం కన్వీనర్లు జనార్దన్, హరిబాబు చౌదరి మాట్లాడుతూ గుజ్జు ఫ్యాక్టరీ యాజమాన్యం రైతులనే కాకుండా ప్రభుత్వాన్ని మోసం చేస్తూ తోతాపురిని క్రషింగ్ చేయకుండా కాలయాపన చేస్తోందని దుయ్యబట్టారు. జిల్లాలో ఇప్పటికే 25 శాతం కాయలు రాలిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం రూ.4 సబ్సిడీగా ఇస్తున్నా గుజ్జు పరిశ్రమల యజమానులు రూ.8 ఇవ్వడానికి జాప్యం చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని యాజమాన్యాలపై కేసులు పెడతామని హెచ్చరించారు. అనంతరం జేసీ విద్యాధరికి వినతిపత్రాన్ని ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ మామిడి రైతులకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు. బయటి రాష్ట్రాల నుంచి కాయలు రాకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ నేతలు మునిరత్నం నాయుడు, ఉమాపతి నాయుడు, శంకర్, నాగమోహన్‌రెడ్డి, భాగ్యనందరెడ్డి, రమేష్, నాగరాజ్ పాల్గొన్నారు.

● తాగునీటి సమస్యను పరిష్కరించాలని బంగారుపాళ్యం మండలం జిల్లేడుపల్లె పంచాయతీ జె.కొత్తూరు ఎస్టీకాలనీ వాసులు కోరారు. తాగునీటి కోసం కిలోమీటరు దూరం వెళ్లి తెచ్చుకోవాల్సి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తబోరును డ్రిల్లింగ్ చేయడంతో పాటు ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించాలని కోరారు.

● చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్య ఉద్యోగుల బదిలీల్లో ఆన్‌లైన్ సిస్టంలో ఇన్, అవుట్‌ను చూపించే విధంగా చర్యలు చేపట్టాలని ఏఐటీయూసీ నేతలు జేసీ విద్యాధరిని కోరారు. ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు వెంకటేష్, దాసరి చంద్ర మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో చిత్తూరు ఆస్పత్రికి ఎవరైనా రావాలన్నా, ఇక్కడ నుంచి ఎవరైనా వెళ్లాలన్నా ఆన్‌లైన్‌లో ఖాళీలను చూపించడం లేదన్నారు. దీంతో బదిలీల విషయంలో వైద్య, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆన్‌లైన్‌లో అవుట్, ఇన్ వివరాలను పొందుపరచాలని వారు కోరారు.

● ఎన్‌వోసీ, క్లియరెన్స్ సర్టిఫికెట్లు అడిగితే కొంత మంది గూండాల చేత బెదిరింపులకు గురిచేస్తున్నారని విజయపురం మండలం కలియంబాక్కంకు చెందిన వేలు అనే రైతు పేర్కొన్నారు. గతంలో ఎన్‌వోసీ, క్లియరెన్స్ సర్టిఫికెట్ల కోసం సీఈవో రాధ, మాజీ సీఈవో మురుగయ్యలు తన వద్ద రూ.15వేలు లంచం తీసుకున్నారని, అయినా తానడిగిన సర్టిఫికెట్లను ఇవ్వలేదన్నారు. దీనిపై కలెక్టర్, జేసీకి ఫిర్యాదు చేశానని, దానిని వెనక్కుతీసుకోవాల్సిందిగా బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విచారించి న్యాయం చేయాలని కోరారు.

● **కలెక్టరేట్‌కు 235 అర్జీలు**

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 235 మంది అర్జీదారులు హాజరై సమస్యలతో కూడిన అర్జీలను అధికారులకు ఇచ్చారు. బాధితుల నుంచి జేసీ విద్యాధరి, డీఆర్వో మోహన్ కుమార్, డిప్యూటీ కలెక్టర్లు అనుపమ, విజయలక్ష్మీ, ఆర్డీవో శ్రీనివాసులు కూడా వినతిపత్రాలను స్వీకరించారు. వీటిలో శాఖలవారీగా.. రెవెన్యూశాఖకు 175, పోలీసుశాఖకు 15, డీఆర్‌డీఏకు 25, పంచాయతీరాజ్‌కు 3, జిల్లా రిజిస్ట్రార్‌కు 3, డీఎస్వోకు 5, మిగిలినశాఖలైన విద్యుత్, మున్సిపాలిటీ, డీఎంహెచ్‌వో, రూరల్ డెవలప్‌మెంట్, డీసీసీ బ్యాంకు, ఇరిగేషన్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్‌శాఖకు ఒక్కో అర్జీ వంతున అందాయి.

పోలీసుశాఖకు 34 ఫిర్యాదులు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ మణికంఠ

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమం జరిగింది. బాధితుల నుంచి ఎస్పీ మణికంఠ వినతిపత్రాలను స్వీకరించారు. అలాగే ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, డీటీసీ డీఎస్పీ రాంబాబులు కూడా అర్జీలను తీసుకున్నారు. సోమవారం నాటి కార్యక్రమంలో మొత్తం 34 అర్జీలు అందాయి. వీటిలో చీటింగ్ 4, వరకట్న వేధింపులు 1, కుటుంబ తగాదాలు 4, వేధింపులు 1, ఇంటి తగాదాలు 2, భర్త వేధింపులు 2, భూ తగాదాలు 12, డబ్బు తగాదాలు 5, దారి సమస్యలపై 3 అర్జీలు అందాయి.

ప్రజాపక్షపాతి ముద్దుకృష్ణమ

● భానుప్రకాష్



ముద్దుకృష్ణమ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి స్వర్గీయ ముద్దుకృష్ణమ నాయుడు ప్రజాపక్షపాతి అని, పార్టీలకతీతంగా సేవచేస్తూ ప్రజలతో కలిసిపోయిన నాయకుడని ఎమ్మెల్యే భానుప్రకాష్ అన్నారు. ముద్దుకృష్ణమ నాయుడి 79వ జయంతిని పురస్కరించుకుని నగరి టవర్‌క్లాక్ వద్ద ఆయన విగ్రహాన్ని సోమవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తన తండ్రి అడుగుజాడలలో నడుస్తూ అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. వెన్నుపోటు దినం అంటూ రోజా నోటికొచ్చినట్లు అబద్ధాలు చెబుతూ ప్రజలను నమ్మించాలని చూసినా ఎవరు ఏమి చేస్తున్నారో ప్రజలు గుర్తిస్తున్నారని చెప్పారు. విగ్రహావిష్కరణ అనంతరం సుమారు 1700 మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, ఎమ్మెల్యే స్వయంగా వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్‌బాబు, శ్రీనివాసులు మొదలియార్, రాష్ట్ర టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి మీరా, జవహర్‌రెడ్డి, వేణు, కృష్ణారెడ్డి, జ్యోతి నాయుడు, ఎం.వి.శ్రీనివాసులు, ఎం.వి.బాబు, గుణశేఖర్, అల్లిముత్తు, దశరథవాసు, మణి, సెల్వమణి, ధనంజయరాజు, బాబు నాయుడు, దయాలన్, మదివాసన్, మాణిక్యవాసన్, అశోక్‌రాయల్, చిట్టి, కన్నెప్ప, కన్నయ్య, పురుషోత్తం నాయుడు, నారాయణస్వామి నాయుడు, ఉమాపతిరాజు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హరియాణా ముఠా సభ్యుడి అరెస్టు

కుప్పం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దు దాటుతూ కుప్పంలో పట్టుబడిన హరియాణా ముఠా సభ్యుడు సాజిద్ (40)ని ఆదివారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ పార్థసారథి తెలిపారు. అయిదుగురితో కూడిన హరియాణా దోపిడీదారుల ముఠా ఈనెల 3వ తేదీ రాత్రి కుప్పం మీదుగా తమిళనాడు వెళ్లే క్రమంలో పోలీసులు ఆపడానికి ప్రయత్నించారు. దీంతో వారు గుడుపల్లె ఎస్ఐ శ్రీనివాసులను వాహనంతో తొక్కించడానికి ప్రయత్నించడం, రూరల్ సీఐ మల్లేశ్ యాదవ్ కాల్పులు జరపడం తెలిసిందే. ముఠా సభ్యులందరూ తప్పించుకున్నా పల్వాల్‌కు చెందిన సాజిద్ ఆచూకీ కనుగొన్న పోలీసులు అతడిని అరెస్టు చేశారు. ఆదివారం రాత్రి పుంగనూరు కోర్టులో హాజరు పరచి, మదనపల్లె జైలుకు రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ చెప్పారు. మిగిలిన వారికోసం గాలిస్తున్నామన్నారు.

బీజేపీ ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తొలగింపు

కుప్పం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ శివశంకర్‌ను బాధ్యతల నుంచి తొలగిస్తూ ఆ పార్టీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు ఎస్.జగదీశ్వరనాయుడు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంచాలని, ఎన్డీయే పార్టీలైన టీడీపీ, జనసేన సమావేశాలకు కూడా ఆహ్వానించకూడదని నిర్ణయించారు. తన పరువుకు భంగం కలిగిస్తున్నారంటూ బీజేపీ రాష్ట్ర కార్యదర్శి తులసీనాథ్ మీద శివశంకర్ పోలీసులకు ఫిర్యాదు చేయడమే తొలగింపునకు కారణమని తెలుస్తోంది. ఫిర్యాదుతో తులసీనాథ్‌పై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ శంకరయ్య తెలిపారు.

ఎస్జీటీలకు ప్రత్యక్ష బదిలీలే

సర్కారు నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాల హర్షం

చిత్తూరు సెంట్రల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా సెకండరీ గ్రేడ్ టీచర్లకు ప్రత్యక్ష బదిలీలు చేపట్టడానికి ప్రభుత్వం ఆమోదం తెలపడంపై ఉపాధ్యాయ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ బదిలీలు వద్దు, ప్రత్యక్ష బదిలీలు ముద్దు అనే నినాదంతో ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక కింద సంఘాల నేతలు సోమవారం చిత్తూరు ఎన్జీవో కార్యాలయంలో నిరాహార దీక్ష చేపట్టారు.రాష్ట్రస్థాయిలో ఉపాధ్యాయ సంఘాల నేతలు, విద్యాశాఖ ఉన్నతాధికారుల నడుమ ఉదయం నుంచి జరిగిన చర్చలు ఫలించాయి. సెకండరీ గ్రేడ్ టీచర్లకు ప్రత్యక్ష బదిలీలు చేపడతామని సోమవారం రాత్రి ప్రభుత్వం ప్రకటించింది.దీనిపై ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ, పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిప్రసాద్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు స్వామి కన్నన్, ఎస్టీయూ రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షుడు గంటా మోహన్, ఎస్ఎస్ నాయుడు, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వినాయకం, మణిగండన్, సోమశేఖర్, మదన్మోహన రెడ్డి, ముక్తార్, విజయభాస్కర్, మంజునాథగుప్తా, నాగరాజు, గోపీనాథ్, అఫ్జల్‌ఖాన్, విజయకుమార్, గోవిందస్వామి, సుధాకర్, రెడ్డెప్ప, రెహనాబేగం, మోహన్‌బాబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

● పీసీసీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి



కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో షర్మిల తదితరులు

చిత్తూరు రూరల్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పీసీసీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.చిత్తూరులో సోమవారం షర్మిలారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని కోరారు.అనంతరం వివిధ మండలాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తల నుంచి పార్టీ బలోపేతానికి సలహాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు.పూతలపట్టు నియోజకవర్గానికి చెందిన కొంత మంది నాయకులు మాట్లాడుతూ జిల్లాలో నాయకత్వ లోపం ఉందన్నారు. ఇటీవల తిరుపతి, పూతలపట్టుల్లో దళితుడిపై దాడులు జరిగితే జిల్లా నాయకత్వం కనీసం స్పందించలేదన్నారు. ఇలాంటప్పుడు పార్టీ ఎలా బలోపేతం అవుతుందన్నారు.కుప్పం నాయకులు మాట్లాడుతూ ముందు నుంచి పార్టీలో కష్టపడిన వారిని కాదని ఎన్నికల సమయంలో వచ్చిన వారికి పదవులు, టికెట్లు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

నియోజకవర్గాలవారీగా అభివృద్ధి ప్రణాళిక

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాలవారీగా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాలను సోమవారం అమరావతిలోని సచివాలయం నుంచి సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో ప్రారంభించారు.అనంతరం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, ప్రజాప్రతినిధులు, ఇతర అధికారులతో యాక్షన్ ప్లాన్ అమలుపై చర్చించారు. ప్రతి యూనిట్ కార్యాలయ నిర్వహణకు రూ.10 లక్షలు అందిస్తామని హామీ యిచ్చారు. యాక్షన్ ప్లాన్ యూనిట్‌కు స్థానిక ఎమ్మెల్యే అధ్యక్షుడిగా ఉంటారని, నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఉపాధ్యక్షుడిగా, ఎమ్మెల్సీ, మున్సిపాలిటీ, నగర పంచాయతీ చైర్మన్లు, ఆర్డీవో, సబ్‌కలెక్టర్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు సభ్యులుగా, ఎంపీడీవో కన్వీనర్‌గా వ్యవహరిస్తారన్నారు. ఎమ్మెల్యే, నోడల్ ఆఫీసర్ అకడమిషన్-1, యువ ప్రొఫెషనల్-1, విజన్ స్టాఫ్ (గ్రామ, వార్డు సచివాలయ) -5తో కలిసి తొమ్మిదిమంది బృందంగా పనిచేస్తారన్నారు. ప్రతి జిల్లాకు విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లు సిద్ధం చేశామని, ఐదేళ్ళ రోడ్ మ్యాప్ రూపొందించామని లక్ష్యసాధనల కోసం యూనిట్లు ఏర్పాటు చేశామని చెప్పారు. అన్ని జిల్లాలూ సమానంగా అభివృద్ధి చెందేలా చూస్తామని చెప్పారు. చిత్తూరు కలెక్టరేట్ నుంచీ ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, డీఎంహెచ్‌వో సుధారాణి, ఆర్టీసీ ఆర్ఎం జగదీష్, సమగ్రశిక్ష ఏపీసీ వెంకట్రమణ, ఎల్డీఎం హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి కేటగిరీలవారీగా యోగాంధ్ర పోటీలు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ, మండలస్థాయి పోటీలు ఇటీవల ముగిశాయని, మంగళవారం నుంచి చిత్తూరు కేంద్రంలో జిల్లాస్థాయిలో యోగాంధ్ర పోటీలు జరుగుతాయని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేశామని నోడల్ ఆఫీసర్, జేసీ విద్యాధరి తెలిపారు. ఈనెల 10వ తేదీ నుంచి ఐదురోజులపాటు స్థానిక మెసానికల్ గ్రౌండ్ సమీపంలోని జ్యోతిరావు పూలే భవన్‌లో కేటగిరిల వారీగా పోటీలు జరుగుతాయన్నారు. జూనియర్ విభాగం (10-18 సంవత్సరాలు), యువ విభాగం (19-35 సంవత్సరాలు), సీనియర్స్ విభాగం (36 సంవత్సరాలకు పైబడి) వారీగా పోటీలు నిర్వహిస్తారన్నారు. ఒంటరి ఆసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం విభాగాలుగా వ్యక్తిగత ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మండల స్థాయి విజేతలు ఈ పోటీలకు అర్హులని, జిల్లాస్థాయి విజేతలు ఈనెల 16 నుంచి రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు.

కల్లూరు, పాళెం పంచాయతీల్లో గజదాడులు

● హైవేపై హంగామాతో భయాందోళన



ఏనుగుల దాడిలో ధ్వంసమైన మామిడిచెట్టు



చింతలవంక వద్ద సంచరిస్తున్న ఏనుగు

కల్లూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతున్నాయి. కల్లూరు, పాళెం పంచాయతీల్లో ఆదివారం రాత్రి మామిడి పంటకు అపారనష్టం కలిగించాయి. మామిడి చెట్లను విరిచేశాయి. పశ్చిమ అటవీ ప్రాంతం నుంచి ముచ్చుగుట్ట మీదుగా ఎద్దులవారిపల్లికి 14 ఏనుగుల గుంపు చేరుకుంది. మామిడితోటల్లో తిరుగుతూ కాయలను నేలరాలుస్తూ చెట్ల కొమ్మలను విరిచేశాయి. కల్లూరులో రైతులు నూర్జాహాన్, మహమ్మదలి, ఆలీ, చెంగల్రాయులు, నరసింహులు, లక్ష్మీనారాయణ, ఏక్‌బాల్‌లకు చెందిన మామిడిచెట్లను విరిచేశాయి. వీటిని తూర్పు ప్రాంతంలోకి రాకుండా రెండు రోజులుగా టపాకాయలు పేల్చారు. అయినా ఇవి రహదారిని దాటేందుకు విఫలయత్నం చేశాయి. సోమవారం వేకువజామున జాతీయ రహదారిపైకి చేరుకున్నాయి. వీటిని గమనించిన డ్రైవర్లు తమ వాహనాలను వెంటనే ఆపేశారు. తీవ్రభయాందోళన చెందారు. కాస్సేపటికి హైవేను దాటి పాళెం పంచాయతీలోకి అడుగుపెట్టాయి. కోటపల్లికి చెందిన రైతు గోపి, కల్లూరుకు చెందిన రైతు యుగంధర్, జూపల్లికి చెందిన రైతు వెంకటరమణ మామిడిచెట్లను విరిచేశారు. చింతలవంక వద్ద సోమవారం తిష్ట వేసినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ఎఫ్ఆర్‌వో థామస్ సుకుమార్ వచ్చి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈయన వెంట ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ ఉన్నారు. దేవళంపేట, పాళెం, కల్లూరు పంచాయతీల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని థామస్ సుకుమార్, షఫీ లు సూచించారు. సోమవారం వేకువజామున తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోకి 14 ఏనుగులు చేరుకున్నాయన్నారు. పగలంతా చింతలవంక వద్ద తిష్ట వేశాయని, రాత్రిపూట పంటలపై దాడులు చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం



ట్యాంక్ పైకెక్కిన ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశులు



ఎంపీడీవోతో వాగ్వాదం చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ భార్య సుబ్బలక్ష్మి

శ్రీరంగరాజపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పాయిజన్ బాటిల్‌తో ఓవర్ హెడ్ ట్యాంక్‌పై ఎక్కి తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం మేరకు... ఎస్ఆర్‌పురం మండలం ఎగువ కమ్మకండ్రిగ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా వి.వెంకటేశులు పది సంవత్సరాలుగా పని చేస్తున్నాడు. అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాడని అతడిపై గ్రామస్తులు పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ఫిర్యాదుచేశారు. ఈ నేపథ్యంలో వెంకటేశులును ఉద్యోగం నుంచి శాశ్వతంగా తొలగించమని కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలతో ఎంపీడీవో మోహనమురళి ఈ నెల 6వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీవో మోహనమురళి తను ఉద్దేశపూర్వకంగానే ఫీల్డ్ అసిస్టెంట్‌గా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశాడు. గత నెల 13వ తేదీన ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్‌ను జాయిన్ చేసుకోమని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినా ఎంపీడీవో తనను జాయిన్ చేసుకోలేదని, తన ఉద్యోగం పోవడానికి కారణం ఎంపీడీవో అంటూ సోమవారం మండల కేంద్రంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ పై నుంచి వెంకటేష్ ఆరోపించాడు. నా భర్తకు ఏదైనా జరిగితే ఎంపీడీవోనే బాధ్యత వహించాలని వెంకటేష్ భార్య ఎంపీడీవోతో వాగ్వాదానికి దిగారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఎట్టకేలకు చాకచక్యంగా ట్యాంక్‌పైన ఉన్న వెంకటేష్‌ను అక్కడ నుంచి దించేశారు. దీనిపై ఎంపీడీవోను వివరణ కోరగా, కలెక్టర్ ఆదేశాల మేరకు ఎగువకమ్మకండ్రిగ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశులును విధుల నుంచి తొలగించామని, అతడిపై ఎలాంటి దురుద్దేశం లేదని అన్నారు.

సౌత్‌జోన్ బాలికల క్రికెట్‌లో చిత్తూరు గెలుపు

నెల్లూరు(విద్య), జూన్ 9 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుజబుజనెల్లూరులోని సీఏపీ క్రీడామైదానంలో సోమవారం అండర్-15 బాలికల ఏసీఏ సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాలకు చెందిన క్రీడాకారిణులు ఈ పోటీలకు హాజరయ్యారు. వారంపాటు జరిగే పోటీల్లో తొలిరోజు చిత్తూరు, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు నిర్ణీత 25 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 288 పరుగులు సాధించింది. ఈ జట్టులోని గేయకీర్తి 120 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 24.3 ఓవర్లలో పది వికెట్లు కోల్పోయి 118 పరుగులకే ఆలౌట్ కావడంతో చిత్తూరు జట్టు విజయం సాధించింది. రెండో మ్యాచ్‌లో అనంతపురం, కర్నూలు జట్లు తలపడగా, కర్నూలు జట్టు విజయం సాధించింది.

నేటివరకు ఏపీ సేవా పోర్టల్‌కు అంతరాయం

● తాత్కాలికంగా 10 సేవలు నిలిపివేత

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సూచనల మేరకు గ్రామ, వార్డు సచివాలయ శాఖ నిర్వహిస్తున్న ఏపీ సేవా పోర్టల్‌ను మైక్రోసాఫ్ట్ నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డేటా సెంటర్‌కు తరలింపు పనులు (మైగ్రేషన్) చేపడుతున్న దృష్ట్యా ఈనెల 7వ తేదీ నుంచి 10 రకాల సేవలను ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. శనివారం ఉదయం నుంచి మంగళవారం అర్ధరాత్రి వరకు ఈ కారణంగా ఆదాయ ధ్రువీకరణ పత్రం, సమగ్ర ధ్రువీకరణ పత్రం, భూమి మ్యూటేషన్లు, రేషన్, రైస్ కార్డులు, ఇండ్ల స్థల పట్టాలు, సీనియర్ సిటిజన్ కార్డులు, మ్యారేజ్ సర్టిఫికెట్లు, రెవెన్యూ వాటర్ ట్యాక్స్ పట్టణ పరిపాలన సంబంధిత సేవలు, మత్స్యశాఖ సేవలు వంటి 10 రకాల సేవలను ప్రభుత్వం నిలిపివేసినట్లు గ్రామ, వార్డు సచివాలయ జిల్లా కోఆర్డినేటర్ రవికుమార్ తెలిపారు. వీటికి మినహా మిగిలిన సేవలు మీసేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని, ఈ సేవలన్నీ బుధవారం నుంచి ఏపీ సేవా పోర్టల్‌లో పునఃప్రారంభం అవుతుందని ఆయన చెప్పారు. ఈ విషయంలో ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని ఆయన కోరారు.

జిల్లా రిజిస్ట్రేషన్ లక్ష్యం రూ.218.17 కోట్లు



రిజిస్ట్రార్ వెంకటరమణమూర్తి

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పరిధిలో స్థిరాస్థి రంగం ద్వారా ప్రస్తుత ఏడాది రాబడి లక్ష్యంగా రూ.218.17 కోట్లుగా ప్రభుత్వం నిర్ణయించినట్లు జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ అధికారి వెంకటరమణమూర్తి అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చిత్తూరు జిల్లాకు సంబంధించి ఎనిమిది సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు (ఎస్‌ఆర్‌లు) ఉండగా, ఎస్ఆర్‌ల వారీగా చిత్తూరు ఆర్వో రూ.77.79 కోట్లు, పలమనేరుకు రూ.34.91కోట్లు, పుంగనూరుకు రూ.30.79కోట్లు, కుప్పంకు రూ.22.35కోట్లు, చిత్తూరు రూరల్‌కు రూ.15.57కోట్లు, బంగారుపాళ్యంకు రూ.11.44కోట్లు, కార్వేటినగరంకు రూ.10.88 కోట్లను లక్ష్యంగా కేటాయించినట్లు వివరించారు. ఇప్పటివరకు నెలవారి లక్ష్యంలో ఏప్రిల్‌లో రూ.17.45 కోట్లకు గాను రూ.12.24 కోట్లు, మేనెలలో రూ.15.27 కోట్లకు గాను రూ.12.12 కోట్లు, జూన్ నెలకు రూ.17.45కోట్లకు గాను ఆదివారం వరకు రూ.3.54 కోట్లు రాబడి సాధించినట్లు చెప్పారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన జిల్లా లక్ష్యం రూ.181.78 కోట్లకు గాను 77.49 శాతం అనగా రూ.144.50 కోట్లు ప్రభుత్వ ఖజానాకు అందించామన్నారు. గత ఏడాది లక్ష్యంతో పోలిస్తే ప్రభుత్వం జిల్లా రాబడి లక్ష్యాన్ని రూ.181.78 కోట్లు (2024-25) నుంచి ఈ ఏడాది అనగా 2025-26కు రూ.36.39 కోట్లు అదనంగా అనగా రూ.218.18 కోట్లుగా పెంచిందని చెప్పారు. కొత్త ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో చేపట్టిన సంస్కరణలు, స్లాట్ బుకింగ్ విధానం, ఇతరత్రా సేవల కారణంగా ఈ ఏడాది రాబడి లక్ష్యాన్ని వందశాతం సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

లబ్ధిదారులకు గ్యాస్ సిలెండర్ల పంపిణీ



రామకుప్పం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మహిళా సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద పీట వేస్తున్నాయని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబు తెలిపారు. సోమవారం రామకుప్పం మండల సచివాలయ ఆవరణలో పలువురు దీపం-2 లబ్ధిదారులకు ఆయన గ్యాస్ సిలెండర్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆగస్టు నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం అమలు చేస్తారన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు కౌలేష్, ఎంపీడీఓ మురళీధర్‌రెడ్డి, టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పత్రనరాయణాచారి, ఆనందరెడ్డి, ఆంజినేయరెడ్డి, వైస్ఎంపీపీ వెంకట్రామగౌడు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి యోగా భరోసా


యోగాంధ్ర ర్యాలీలో టీడీపీ నేతలు, అధికారులు

రామకుప్పం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల ఆరోగ్యం, ఆయుష్షు భద్రంగా ఉంటుందని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్రనరాయణాచారి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డిలు అన్నారు. సోమవారం రామకుప్పంలో నిర్వహించిన యోగాంధ్ర అవగాహన ర్యాలీ వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయస్సుతో తేడా లేకుండా ప్రతి ఒక్కరూ యోగా చేయడం వల్ల మానసిక ఒత్తిడిని అధిగమించి సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారన్నారు. మరో కార్యక్రమంలో వీరు రైతులకు నాయకులు సబ్సిడీ వేరుశనగ విత్తనకాయల్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు కౌలేష్, ఎంపీడీఓ మురళీధర్‌రెడ్డి, వైస్ఎంపీపీ వెంకట్రామగౌడు, నేతలు రామ్మూర్తి, గుర్రప్ప, కృష్ణానాయక్, మహ్మద్‌రఫీ, నరసింహులు, జయశంకర్ పాల్గొన్నారు.

పాఠశాలల హెచ్ఎంల బాధ్యతల స్వీకారం


జాయినింగ్ ఆదేశాలు అందజేస్తున్న ఎంఈఓ

పలమనేరు, జూన్9 (ఆంధ్రజ్యోతి):మండలంలో 19 మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి లీలారాణి తెలిపారు. సోమవారం ఈ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు నియామకపు ఆదేశాలను ఆమె అందజేశారు. ఈ సందర్భంగా లీలారాణి మాట్లాడుతూ ప్రతి మోడల్ పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయుడితో పాటు 1నుంచి 5 తరగతుల వరకు ప్రతి తరగతికీ ఉపాధ్యాయుడు ఉంటారన్నారు. సోమవారం అన్ని మండల ప్రైమరీ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించారని తెలిపారు. మోడల్ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు.

సీఎం టెలీకాన్ఫరెన్స్‌కు వర్చువల్‌గా ఎమ్మెల్యే హాజరు



పలమనేరు, జూన్9 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-2047పై ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి, ఆర్డీవో భవానీలు ఇక్కడ నుంచి వర్చువల్‌గా హాజరయ్యారు. టెలికాన్ఫరెన్స్ అనంతరం నియోజకవర్గంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఎమ్మెల్యే అధికారులతో చర్చించారు. సమావేశంలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ శ్రీదేవి, డీఎస్పీ ప్రభాకర్, ఎఫ్ఆర్వో నారాయణ, మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, సీఐ నరసింహరాజు, తహసీల్దార్లు ఇన్బనాథన్, అనిల్‌కుమార్, ప్రసన్నకుమార్, ఎంపీడీలు బాలాజి, భాస్కర్, సురేష్‌బాబు, ఈశ్వరన్, రాజేంద్రబాలాజిలతో పాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పాలేటమ్మ జాతర



సోమల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): కందూరులో పాలేటమ్మ ఆలయంలో సోమవారం జాతర ఘనంగా నిర్వహించారు. అమ్మవారి మూల విరాట్‌కు విశేష అలంకరణ జరిపి పూజలు చేశారు. పలు గ్రామాల మహిళలు పొంగళ్లు సమర్పించారు. రాత్రి అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో ఊరేగించారు. ఇంటింటా మంగళ హారతులిచ్చారు. వల్లిగట్ల, కామిరెడ్డివారిపల్లె, నెల్లిమంద, సోమల, తమ్మినాయనపల్లె గ్రామాల భక్తులు దర్శించుకున్నారు. ●ఆవులపల్లె పంచాయతీ గ్రామాల్లో గంగజాతర వేడుకలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గంగమ్మను ప్రతిష్టించడంతో కొత్తూరు, పత్రపల్లె, ఆవులపల్లె, రామకృష్ణాపురం, గాంధీనగర్, రాంపల్లె తదితర గ్రామాల మహిళలు పొంగళ్లు సమర్పించారు.

కృష్ణదేవరాయల విగ్రహ ప్రతిష్టకు విరాళాలు

సోమల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో కృష్ణదేవరాయుల విగ్రహ ప్రతిష్టాపనకు కరకమంద గ్రామస్తులు విరాళాలు అందజేసినట్లు కమిటీ అధ్యక్షుడు మునివెంకటప్ప తెలిపారు. పి. మోహన్ రూ.25 వేలు, మురళీ రూ.10 వేలు, ఆకా మోహన్ రూ.10 వేలు, కర్రి చెన్నమల్లయ్య రూ.10 వేలు, సీతారామయ్య రూ.10 వేలు, ఎం. నారాయణ రూ. 10 వేలు మనోజ్ కుమార్ రూ. 5వేలు అందజేసినట్లు కోశాధికారి జ్యోతీశ్వరుడు తెలిపారు. గుంతచెరువుపల్లె నుంచి రామూర్తి రూ.10 వేలు, ఎన్. సుధాకర్ రూ. 10 వేలు, ఎన్. రెడ్డెప్ప రూ. 5 వేలు అందజేసినట్లు కమిటీ సభ్యులు వివరించారు.

యోగాపై అవగాహనా ర్యాలీ



పుంగనూరు, జూన్9(ఆంధ్రజ్యోతి): యోగా చేయడం వల్ల దీర్ఘకాలిక వ్యాధులు దూరమవుతాయని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఇందిరా సర్కిల్ నుంచి ర్యాలీగా ప్రయివేటు బస్టాండ్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ వరకు మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బందితో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రసుత్త ఆహార అలవాట్ల వల్ల అనారోగ్యం వస్తోందన్నారు. ఉదయం యోగా చేస్తే ఆరోగ్యంతో పాటు శరీరధారుఢ్యంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు సీవీరెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు జగదీష్‌రాజు, మెప్మా పీవో హరినాథ్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు, మహిళా సంఘసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా ఊజీ బుట్టలు

రామకుప్పం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిరైతులకు పంపిణీ చేసేందుకు ఊజీ బుట్టలు సిద్ధంగా ఉన్నాయని ఉద్యాన అధికారులు డింపుప్రియ, వింధ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. ఊజీ బుట్ట, మూడు మాత్రలకు రైతులు రూ.11 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎకరానికి 8 బట్టులు చొప్పున రైతుకు గరిష్ఠంగా 40 బుట్టలు ఇస్తామన్నారు. బుట్టలు కావాల్సిన రైతులు ఆధార్ కార్డు , 1బీ లేక పాసుబుక్ జెరాక్స్‌లతో తమను గానీ, రైతు సేవాకేంద్రం సిబ్బందిని గానీ సంప్రదించాలన్నారు.

గడువు తీరిన తినుబండారాల సీజ్


దుకాణంలో తనిఖీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

కుప్పం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గడువు ముగిసిన, కలుషిత తినుబండారాలు, పానీయాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు వ్యాపారులను హెచ్చరించారు. కమిషనర్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో రెండు బృందాలుగా సిబ్బంది సోమవారం పట్టణంలోని హోటళ్లు, బేకరీలు, చికెన్ సెంటర్లు, శీతల పానీయాల దుకాణాలను తనిఖీ చేశారు. గడువు తీరిన తినుబండారాలు, పానీయాలను సీజ్ చేశారు.

సీడీపీవోగా సరళాదేవి



పుంగనూరు రూరల్, జూన్9(ఆంధ్రజ్యోతి): పుంగనూరు సీడీపీవోగా సరళాదేవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి సీడీపీవోగా పనిచేసిన రాజేశ్వరి శ్రీకాళహస్తికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కొత్త సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు అందించిన పౌష్టికాహారాన్ని సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

భర్త ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, జూన్9(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వైనమిది. రామసముద్రం మండలం సీతారాగానిపల్లెకు చెందిన సునీల్‌కుమార్ వ్యవసాయ పనులు చేస్తుంటాడు. ఇటీవల భార్యతో స్పర్థలు వచ్చాయి. ఈక్రమంలో సోమవారం పంటల కోసం తెచ్చిన పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయాడు. కుటుంబసభ్యులు గుర్తించి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం


శాంతిపురం బస్టాండ్ సర్కిల్లో మానవహారం

శాంతిపురం, జూన్ 9 : యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మండల టీడీపీ అధ్యక్షుడు బాష్యం విశ్వనాధ నాయుడు, ఎంపీడీవో కుమార్‌లు అన్నారు. సోమవారం మండల సచివాలయం నుండి శాంతిపురం బస్టాండ్ సర్కిల్ వరకు యోగాపై అవగాహనకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రతి గ్రామంలో ప్రజలకు యోగాపై అవగాహన కల్పించాలని ప్రభుత్వం ఆదేశాలు జారిచేసిన క్రమంలో. అందుకు శాంతిపురంలో ర్యాలీ చేపట్టారు. గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలతో కలిసి ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

సదుంలో అవగాహన ర్యాలీ

సదుం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక వీధుల్లో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా ద్వారా చేకూరే ప్రయోజనాలను ప్రజలకు నినాదాల ద్వారా వివరించారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, పోలీసులు, బస్టాండు సర్కిల్‌లో మానవహారం నిర్వహించారు.

మామిడికి మద్దతు ధర ప్రకటించాలి

సోమల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మామిడికి మద్దతు ధర ప్రకటించాలని తహసీల్దార్ బెన్నురాజ్‌కు రైతులు సోమవారం వినతి పత్రం సమర్పించారు. .ఎన్నడూ లేని విధంగా తక్కువ ధర వస్తోందని వీరు ఆందోళన వ్యక్తం చేశారు. బేనిషా టన్ను రూ. 15వేల నుంచి 20 వేలు, మల్లికా టన్ను 20 వేలు, తోతాపురి రూ. 12 వేలు లోపు పలుకుతోందన్నారు..మద్దతు ధర ప్రకటించి ఆదుకోవాలని కోరారు.

ప్రభుత్వ ధరకు నిర్వాసితులు ససేమిరా

రోడ్డు విస్తరణ పనులపై స్థల యజమానులతో కడా పీడీ సమావేశం


భూ నిర్వాసితులతో సమావేశమైన పీడీ మర్మత్,నాయకులు

కుప్పం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రధాన రహదారి విస్తరణ రెండోదశ పనులకు కదలిక వచ్చినా మార్కెట్టు ధర చెల్లించాలని భూ నిర్వాసితులు భీష్మించడంతో తాత్కాలికంగా ఆటంకమేర్పడింది. 2014-2019లో టీడీపీ ప్రభుత్వం ఇక్కడి నేతాజీ రోడ్డు విస్తరించి పట్టణాన్ని సుందరంగా తయారు చేయాలని సంకల్పించిన సంగతి తెలిసింది. తొలిదశలో ప్రభుత్వ ఆసుపత్రి నుంచి చెరువుకట్ట దాకా పెద్దగా ప్రైవేటు ఆస్తులు లేకపోవడంతో విస్తరణ పనులు సాఫీగా పూర్తయ్యాయి. రెండవ దశలో కొంతమంది బాధితులు కోర్టుకు ఎక్కడంతో బ్రేకు పడింది. దీని వెనుక నాటి ప్రతిపక్ష వైసీపీ నాయకులున్నట్లు ప్రచారం జరిగింది. తర్వాత అధికార పగ్గాలు చేపట్టిన వైసీపీ 2020లో విస్తరణ పనుల జీవోనే తాత్కాలికంగా నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. గతేడాది కూటమి అధికారంలోకి రావడంతోనే కడా ఏర్పాటైన క్రమంలో మళ్లీ నేతాజీ రోడ్డు విస్తరణపై ఫోకస్ పెట్టింది. ఈ ఏడాది జనవరిలో కడా పీడీ మర్మత్ ఈదిశగా ప్రయత్నించినా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు నిలుపుదల ఉత్తర్వు అడ్డంకిగా మారింది.

మార్కెట్టు రేటు కావాలి:

విస్తరణ పరిధిలోని ఆస్తుల యజమానులతో స్థానిక మండల సచివాలయంలో సోమవారం కడా పీగీ సమావేశమయ్యారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్ సురేశ్‌బాబు, మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావవు, తహశీల్దారు చిట్టిబాబు, మండల టీడీపీ అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు. పీడీకి, బాధిత వర్గాలకు నేతలు మధ్యవర్తులుగా వ్యవహరించారు. నేతాజీరోడ్డులో ప్రభుత్వ ధర మేరకు చదరపు అడుగుకు రూ.5 వేలు నష్టపరిహారం చెల్లిస్తామని కడా పీడీ వికాస్ మర్మత్ ప్రతిపాదించారు. అలాగే ఆర్టీసీ బస్టాండు ముందువైపున నిర్మించబోయే దుకాణ సముదాయాల్లో దుకాణాలను కేటాయిస్తామన్నారు. స్థానికులను ఒప్పించి విస్తరణ చేపట్టాల్సిందిగా సీఎం సూచించినందున చర్చిస్తున్నామన్నారు. ఈ రేటుకు నిర్వాసితులు ససేమిరా అన్నారు. ఏళ్ల క్రితమే చదరపు అడుగు రూ.25 వేల నుంచి రూ.30 వేల దాకా కొనుగోలు చేసి భవనాలు నిర్మించుకున్నామన్నారు. ప్రస్తుత మార్కెట్టు రేటు మాత్రమే సమ్మతమని స్పష్టం చేశారు. దీంతో చర్చల్లో ప్రతిష్టంభన ఏర్పడింది. భూ నిర్వాసితులంతా అవగాహనకు వచ్చి ధర చెప్పాలని మధ్యవర్తులు సూచించడంతో సమావేశం ముగిసింది.

అత్యధికం భూ సమస్యల వినతులే


అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీవో భవాని

పలమనేరు, జూన్9 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌డే నిర్వహించారు. ఆర్డీవో భవానికి ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ఇందులో 90 శాతం పైగా రెవెన్యూ సమస్యలకు సంబంధించినవే. తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగినా పరిష్కారం కాకపోవడంతో వారు ఆర్డీఓ కార్యాలయానికి వచ్చి అర్జీలు అందజేశారు. సర్వే సందర్భంగా కొలతల్లో వ్యత్యాసాలు వచ్చాయని, పాసుపుస్తకాలు రాలేదని ఫిర్యాదులు వచ్చాయి. సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్లను ఆర్డీవో ఫోన్లో ఆదేశించారు.

●గంగవరం మండలం నల్లగుట్లపల్లికి చెందిన యూసఫ్ పలమనేరు మండలం మొరం గ్రామం వద్ద మహదేవయ్య వద్ద 35సెంట్లు కొనుగోలు చేశాడు. పట్టాకోసం పలుమార్లు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకపోయింది. పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలని ఆర్డీవోను కోరాడు.

●గంగవరం మండలం పొన్నమాకులపల్లికి చెందిన కర్రెప్ప ఇటీవల సర్వేతో తన భార్య లక్ష్మమ్మ పేరున ఉన్న భూములు జాయింట్ ఎల్‌పిఎంలో ఉన్నందున వన్‌బి రావడం లేదని ఆవేదన వ్యక్తంచేశాడు. తమ భూమిలో ఉన్న బావి కూడా చూపించడం లేదని ఫిర్యాదు చేశారు. ●బంగారుపాళ్యం మండలం మంగలపల్లికి చెందిన మధుసూదన్‌నాయుడు పొలం వద్దకు వెళ్లేందుకు రికార్డుల్లో 11లింకుల వెడల్పుతో రోడ్డు ఉందని, కొందరు ఈ దారిని ఆక్రమించుకొని తనకు దారి ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు.

ఘనంగా ఎస్టీయూ ఆవిర్భావదిన వేడుకలు


అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

పుంగనూరు రూరల్, జూన్9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎస్టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద డాక్టర్ అంబేడ్కర్ చిత్రాపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడియాల మురళీ, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌యాదవ్‌లు మాట్లాడుతూ పోరాటాలతో ఎస్టీ విజయాలు సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పోకల మధుసూదన్, అయూబ్‌ఖాన్, శ్రీధర్, ప్రసాద్‌బాబు, మంజునాథ్, నారాయణ, శ్రీనివాసులు, శ్రీరాములురెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తన కాయల పంపిణీ



శాంతిపురం, జూన్ 9 : రైతును రాజు చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పమని మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ నందిగం ఉదయకుమార్ నాయుడు, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డిలు అన్నారు. సోమవారం అబకలదొడ్డి గ్రామ సచివాలయ ఆవరణలో ఆర్బీకే కేంద్రంలో వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రైతులకు అన్ని విధాల అన్యాయం చేసిందన్నారు. ప్రభుత్వం రాగానే వ్యవసాయ పరికరాలను, యంత్రాలను సబ్సిడికే రైతులకు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చంద్రశేఖర్, వెంకటేష్, గోపాల్, శేఖర, రమేష్, బాలు, అనుసూయ, శ్యామల పాల్గొన్నారు.

రెండో వైద్యాధికారి లేక ఇబ్బందులు

రామకుప్పం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం(పీహెచ్‌సీ)లో రెండో వైద్యాధికారి పోస్టు ఖాళీగా ఉండటంతో రోగులు అసౌకర్యానికి గురవుతున్నారు. రెండు నెలల క్రితం ఇక్కడి రెండో వైద్యాధికారి డెప్యుటేషన్‌పై బదిలీ అయ్యారు. అప్పటి నుంచి మొదటి వైద్యాధికారి మాత్రమే ఉన్నారు. ఇద్దరున్నపుడు రోజూ 150 మంది వైద్యసేవలు పొందేవారు. రెండో వైద్యాధికారిగా మహిళ ఉన్నప్పుడు మహిళలు పీహెచ్‌సీకి వచ్చేవారు. ఆమె బదిలీ కావడంతో మహిళలు రావడం తగింది. మొదలి వైద్యాధికారి బిజీ అయితే మండలంలో 104 సేవలకు దూరంగా ఉండాల్సి వస్తోంది. ఆయన నియోజకవర్గ, జిల్లా స్థాయి సమావేశాలకు వెళ్తే సిబ్బందే చికిత్సలందించాల్సి వస్తోంది. ఆ పరిస్థితుల్లో గర్భిణులను ఇతర ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు తరలించి కుటుంబ సభ్యులు వ్యయప్రయాసలకు గురవుతున్నారు. రెండు నెలల క్రితం వరకు పీహెచ్‌సీకి వచ్చే రోగుల సంఖ్య 150 పైగా ఉండాది. ప్రస్తుతం ఆ సంఖ్య సగానికి పడిపోయింది. పాలకులు, అధికారులు స్పందించి ఇక్కడి పీహెచ్‌సీలో రెండో వైద్యాధికారిగా మహిళను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రొంపిచెర్లలో వర్షం

రొంపిచెర్ల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్లలో సోమవారం సాయంత్రం ఓమోస్తరు వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కాస్సేపు ఆహ్లాదాన్ని పంచింది. వర్షపు నీరు రోడ్డుపై ప్రవహించింది. పగలంతా తీవ్ర ఎండతో ఇబ్బంది పడ్డ ప్రజలు వానతో ఉపశమనం పొందారు. రైతులు వ్యవసాయ పనులు చేసుకోవచ్చని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మామిడి రైతుల ఆవేదన

సదుం: మండల కేంద్రంలో సోమవారం సాయత్రం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో మామిడి పంటకు నష్టం వాటిల్లింది. మామిడికి గిట్టుబాటు ధరలు లేక ఆందోళన చెందుతున్న రైతులకు మరింత నష్టం కలిగిస్తోంది.

భారతంమిట్టలో శాస్త్రోక్తంగా హోమాలు

సోమల, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సమీప భారతంమిట్టలో మహాభారత యజ్ఞం సందర్భంగా సోమవారం పాండవ ఆలయంలో ఉభయదారులు ఇడగట్టు జయరామయ్య కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో హోమాదికార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈనేపథ్యంలో అభిషేకపూజలు జరిపారు. నాగరత్న ప్రదర్శించిన రాజసూయాగం ఘట్టం అలరించింది. ఉత్సవమూర్తులను ఊరేగించారు.

రామకుప్పం: రాజుపేటక్రాస్‌లో గంగమ్మ ఆలయ కుంబాభిషేక మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కుంబాభిషేక మహోత్సవాలు సందర్భంగా నిర్వాహకులు ఆలయాన్ని పచ్చని తోరణాలు, విద్యుద్దీపాలు, పుష్పాలతో అలంకరించారు. సాయంత్రం వేదపండితులు గోపూజ, గంగపూజ, గురుగణపతి పూజలతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు.

వైభవంగా దండు మారెమ్మ జాతర

●రొంపిచెర్ల: దానరిగూడెంలోని దండు మారెమ్మ జాతర వైభవంగా జరుగుతోంది. సోమవారం గ్రామంలోని ఇళ్ల నుంచి మహిళలు పెద్ద ఎత్తున ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారికి పూజలు, ఊజల సేవ అర్చకులు మునిరాజశర్మ నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు పురస్కారాలు

కుప్పం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల ఓపి గ్రూపునకు చెందిన విద్యార్థినులు ఆర్.లలిత కుమారి, వి.సుష్మితలకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌లు షైనింగ్ అవార్డులు ప్రదానం చేశారు. చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో సోమవారం రిగిన ప్రతిభా పురస్కారాల వేడుకలో రూ.20 వేల వంతున నగదు బహుమతి అందించడంతోపాటు, ప్రశంసా పత్రాలు ప్రదానం చేసి సన్మానించారు. **రొంపిచెర్ల:** మోడల్‌స్కూల్ విద్యార్థులు రిషిత(586), భరత్‌కుమార్‌నాయుడు(578), మీనావాణి (556), రొంపిచెర్ల జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని జోయా(565), కేజీబీవీ విద్యార్థిని ఎం.లలిత(536) షైనింగ్ స్టార్ అవార్డులు పొందారు. **పుంగనూరు రూరల్:** పట్టణంలో ఉజ్జయిని కాలేజి విద్యార్థిని లిఖిత (975) అవార్డు అందుకున్నట్లు కాలేజీ కరస్పాండెంట్ కృష్ణమూర్తి తెలిపారు. వికాశ్ పాఠశాలకు చెందిన పూజిత (593) అవార్డు అందుకున్నట్లు హెచ్ఎం అఖీలారెడ్డి తెలిపారు.

శాంతిపురం : వివేకానంద పాఠశాల విద్యార్థులు భవ్య, షహిస్తా అంజుమ్‌లు అవార్డులు అందుకున్నారు. విద్యార్థులను పాఠశాల యాజమాన్యం సన్మానించింది. **రామకుప్పం:** పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపి మండల టాపర్లుగా నిలిచిన విద్యార్థులు కీర్తన(పంద్యాలమడుగు జడ్పీ ఉన్నతపాఠశాల), త్రిష(విజలాపురం జడ్పీ ఉన్నతపాఠశాల), షబీహా సదాఫ్(రామకుప్పం, బాలికోన్నత పాఠశాల), అనూష(చెల్దిగానిపల్లె, జడ్పీ ఉన్నతపాఠశాల), రామచంద్రనాయక్(రామకుప్పం, సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయం), కీర్తన(రామకుప్పం, బాలికోన్నత పాఠశాల)లు అవార్డులు అందుకున్నారు. **సదుం:** స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి సైదు సాబ్ కలెక్టర్ నుంచి అవార్డు, ప్రోత్సాహక నగదు అందుకున్నాడు.


కలెక్టర్ సుమిత్‌కుమార్ నుంచి షైనింగ్ స్టార్ అవార్డు తీసుకుంటున్న(కుడి నుంచి ఎడమకు) సుస్మిత, లలిత కుమారి, సైదు సాబ్, షబీహాసదఫ్, ఎం.లలిత, లిఖిత, భవ్య

ముద్దుకృష్ణమ అడుగుజాడల్లో నడుస్తాం

● ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



ముద్దుకృష్ణమ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే భానుప్రకాష్

విజయపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): తన తండ్రి మాజీ మంత్రి, స్వర్గీయ గాలి ముద్దుకృష్ణమ నాయుడి అడుగుజాడల్లో నడుస్తామని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. సోమవారం ముద్దుకృష్ణమ 79వ జయంతిని పురస్కరించుకొని విజయపురం మండల పరిషత్ కార్యాలయం వెలుపల ఆయన విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. తన తండ్రి ప్రజల మనసులో చెరగని ముద్ర వేశారని, ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. మధ్యాహ్నం సుమారు 1000 మందికి అన్నదానం చేశారు. రాష్ట్ర టీడీపీ బీసీ అధికార ప్రతినిధి చుక్కా ధనుంజయయాదవ్, చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి చినబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, చిలకం ఈశ్వరప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు శరవణ, గజేంద్ర నాయుడు, గుణభూషణమ్మ, మునిభాస్కర్‌రాజు, పవన్, సుధాకర్‌రాజు, వేణుగోపాల్ నాయుడు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● నింద్ర (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, దివంగత నేత ముద్దుకృష్ణమ నాయుడి జయంతి సందర్భంగా నింద్రలో టీడీపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండల టీడీపీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, నాయకులు గంధమనేని రాజేష్, దశరథవాసు, వెంకటేశులు నాయుడు, భాస్కర్‌రెడ్డి, చిట్టిబాబు, మురళీ నాయుడు, గంగాధరం నాయుడు, ఆనందరాజు, విజయ్‌కుమార్, నాయకులు రమేష్, నాగభూషణంరాజు, దొరస్వామి నాయుడు, పరదేశి, రఘు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

యోగా చేయండి... ఆరోగ్యంగా ఉండండి: మేయర్

చిత్తూరు అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): నిత్యం యోగా చేయడం ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని నగర మేయర్ అముద పిలుపునిచ్చారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలోని అన్ని సచివాలయాల్లో యోగాపై అవగాహన ర్యాలీలను నిర్వహించారు. 39వ డివిజన్ పరిధిలో జరిగిన ర్యాలీలో మేయర్ అముద, కమిషనర్ నరసింహప్రసాద్‌లు పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో యువత, మహిళలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కమిషనర్ నరసింహప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 21న నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురష్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని డివిజన్లలో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో లోకేష్, సీఎంఎం వెంకటరమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు కార్యదర్శులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు తొమ్మిది వినతులు

చిత్తూరు అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో నగరంలోని నలుమూలల నుంచి తొమ్మిది మంది హాజరై సమస్యలతో కూడిన వినతిపత్రాలను అందించారు. బాధితుల నుంచి కమిషనర్ నరసింహప్రసాద్ అర్జీలను స్వీకరించారు. సోమవారంనాటి కార్యక్రమంలో ఫించన్లకు 3, ఇంజనీరింగ్‌కు 2, రెవెన్యూకు 2, టౌన్‌ప్లానింగ్‌కు 2 చొప్పున మొత్తం 9 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌లో లోకేష్, ఎంఈ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్‌గా శ్రీనివాసులు బాధ్యతల స్వీకరణ

వెదురుకుప్పం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోషియల్ స్కూల్ అసిస్టెంట్‌గా కార్వేటినగరం మండలం కొల్లాగుంట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల నుంచి శిగరాల శ్రీనివాసులు సోమవారం వచ్చి బాధ్యతలు స్వీకరించారు. బదిలీల క్రమంలో పదోన్నతిపై ఆయన ఇక్కడికి వచ్చారు.

స్వర్ణాంధ్ర విజన్‌పై సీఎం వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే, మేయర్ తదితరులు

చిత్తూరు అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమ ప్రారంభోత్సవంలో భాగంగా అమరావతి నుంచి సీఎం చంద్రబాబు సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, కమిషనర్ నరసింహప్రసాద్, జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర 2047 విజన్‌లో భాగంగా జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్, నియోజకవర్గ యాక్షన్ ప్లాన్, పీ-4 అమలుపై సీఎం వివరించారు.

● పూతలపట్టు (ఆంధ్రజ్యోతి): విజన్-2047 లక్ష్యాలను సాధించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం సీఎం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు దొరబాబు చౌదరి, ఎంపీపీ కుమారి, జడ్పీటీసీ దేవిక తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు చర్యలు చేపట్టాలి

చిత్తూరు అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ చెప్పారు. రోడ్డు విస్తరణలో భాగంగా సోమవారం కలెక్టర్ బంగ్లా వద్ద రోడ్డు విస్తరణలో కోల్పోయే ప్రదేశాన్ని కార్పొరేషన్ అధికారులు మార్కింగ్ చేశారు. రోడ్డు విస్తరణలో కలెక్టర్ బంగ్లా ప్రహరీగోడ కోల్పోవాల్సి వస్తుందని ఏసీపీ నాగేంద్ర కలెక్టర్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు వేర్వేరుగా వివరించారు. రోడ్డు విస్తరణకు అవసరమైన స్థలాన్ని తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఎమ్మెల్యే రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు.

ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికీ అందాలి

● ఎమ్మెల్యే భానుప్రకాష్


విజయపురం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికీ అందాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం విజయపురం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మామిడి రైతులు తోతాపురి రకం సరఫరా చేస్తే ఫ్యాక్టరీలు రూ.8లు, ప్రభుత్వం సబ్సిడీ రూ.4లు మంజూరు చేస్తుందని తెలిపారు. తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో రా జేంద్ర, ఏవో రజనీకుమారి, ఇరిగేషన్ ఏఈ ప్రశాంత్ పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడితో మాట్లాడిన షర్మిల

పూతలపట్టు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సోమవారం రాత్రి రంగంపేట క్రాస్‌రోడ్డు సమీపాన గల టోల్‌గేట్ వద్ద తమ వాహనాన్ని కాసేపు ఆపారు. చిత్తూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భాస్కర్ టోల్‌గేట్ వద్ద తమ వాహనాన్ని ఆపి షర్మిల కోసం వేచివుండగా, ఆమె తమ కాన్వాయ్‌ని ఆపారు. అనంతరం భాస్కర్‌ని తమ వాహనంలోకి పిలిపించి జిల్లాలోని పార్టీ స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. 20 నిమిషాల అనంతరం బయలుదేరి పీలేరు వైపు వెళ్లారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

బంగారుపాళ్యం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా స్థానిక మార్కెట్ యార్డుకు మామిడి లోడుతో వచ్చే డ్రైవర్లకు సీఐ కత్తి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు.ట్రాక్టర్ ట్రాలీలకు వెనుకవైపు రేడియం స్టిక్కర్లను సీఐ, ఎస్ఐ ప్రసాద్‌లు స్వయంగా అతికించారు.



రైతులు నష్టపోకూడదనే

తోతాపురి టన్నుకు రూ.12వేలు

● ప్రభుత్వ విప్ డాక్టర్ థామస్



జైన్‌ఫ్యాక్టరీలో సీనియర్ మేనేజర్ దిలీప్‌తో మాట్లాడుతున్న థామస్

గంగాధరనెల్లూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రైతులు నష్టపోకూడదనే తోతాపురి మామిడి టన్నుకు రూ.12వేలు ధరను కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని ప్రభుత్వ విప్ థామస్ తెలిపారు. గంగాధరనెల్లూరు పంచాయతీ 100 గొల్లపల్లె వద్ద గల జైన్ ఫ్యాక్టరీలో సోమవారం సాయంత్రం జనరల్ మేనేజర్ దిలీప్‌తో తోతాపురి మామిడిపై రైతులు తరపున థామస్ చర్చలు జరిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తోతాపురి మామిడి ధర విషయంలో ఇప్పటికే సీఎం చంద్రబాబు, మంత్రి అచ్చెన్నాయుడు చర్చించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం తరపున రైతులు సరఫరా చేసే తోతాపురి మామిడి టన్నుకి రూ.4వేలు, జైన్ ఫ్యాక్టరీ నిర్వాహకులు టన్నుకు రూ.8వేలు కలిపి మొత్తంగా టన్నుకు రూ.12 వేలు నగదును రైతుకు అందజేయనున్నట్లు తెలిపారు. మంగళవారం నుంచి జైన్ ఫ్యాక్టరీకి రైతులు తోతాపురి మామిడిని సరఫరా చేయవచ్చునని, రైతులు సైతం ఫ్యాక్టరీ నిర్వాహకులకు సహకరించాలని పిలుపునిచ్చారు. మామిడి రైతులకు రెవిన్యూ యంత్రాంగం సేవలు అందిస్తారని చెప్పారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోగల రైతులకు సంబంధించిన తోతాపురి మామిడి కాయలను ఫ్యాక్టరీ నిర్వాహకులు మొదటి ప్రాధాన్యత ఇచ్చి తీసుకోవాలని జనరల్ మేనేజర్ దిలీప్‌ను కోరగా, సమ్మతించారని తెలిపారు. ఈకార్యక్రమంలో టీడీపీనేతలు ఎర్రగుంట్ల కృష్ణమ నాయుడు, శ్రీధర్ యాదవ్, స్వామిదాస్, బాబు నాయుడు, మోహన్ నాయుడు, రుద్రయ్య నాయుడు, కామసాని కోదండరెడ్డి, జ్యోతియాదవ్, జీవరత్నం, కృష్ణమూర్తి నాయుడు, హరీష్ యాదవ్, గురసాల కిషన్‌చంద్, వెంకటేష్‌యాదవ్, పాల్గొన్నారు.

షైనింగ్ స్టార్స్ అవార్డులకు ఆరుగురి ఎంపిక



కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్ చేతులమీదుగా భూమికకు ప్రశంసాపత్రం

యాదమరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నెలకొల్పిన షైనింగ్ స్టార్స్ అవార్డులకు యాదమరి మండలం నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో రుక్మిణి తెలిపారు. చిత్తూరు నగరంలోని నాగయ్య కళాక్షేత్రంలో మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే మురళీమోహన్ చేతులమీదుగా ప్రతిభ ఆధారంగా అవార్డులు అందుకున్నారు. డి.కె.చెరువు ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.భూమిక, యాదమరి జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎస్.పద్మావతి, కె.గొల్లపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.ద్రాక్షాయణి, గుడ్‌షెపర్డ్ స్కూల్ విద్యార్థులు ప్రకాష్, హారిక, గాబ్రియేల్ స్కూల్ నుంచి ఆర్.కుష్బులకు ఒక్కొక్కరికి రూ.20 వేలు నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందించారు. విద్యార్థులను ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.



కలెక్టరు చేతుల మీదుగా షైనింగ్‌స్టార్ అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

● విజయపురం (ఆంధ్రజ్యోతి): కలెక్టరు సుమిత్‌కుమార్ చేతుల మీదుగా సోమవారం చిత్తూరులో విజయపురం మండలానికి చెందిన విద్యార్థులు అలేఖ్య, ధరణీప్రియలు షైనింగ్‌స్టార్ అవార్డు అందుకున్నారు. అవార్డులో భాగంగా ప్రశంసాపత్రం, రూ.20 వేలు చెక్కు అందుకున్నారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

చిత్తూరు అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని రెండో పట్టణ సీఐ నెట్టికంఠయ్య పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని కైలాసపురం, సంతపేట కాలనీల్లో పోలీసు సిబ్బందితో కలిసి సీఐ పల్లె నిద్ర చేశారు. యువత, కాలనీవాసులతో మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు, సెల్‌ఫోన్లకు బానిసైతే.. ఆ ఊబినుంచి బయటకు రావడం కష్టమని చెప్పారు. ఎవరైనా డ్రగ్స్‌ను వాడినా, విక్రయించినా వారి సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు.

చిత్తూరు రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

చిత్తూరు రూరల్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రైల్వే స్టేషన్‌లో సోమవారం రైల్వే పోలీసులు, డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్లాట్‌ఫాం, బుకింగ్ ఆఫీస్, పార్శిల్ ఆఫీస్, వెయిటింగ్ హాల్‌లో తనిఖీలు చేశారు. అనంతరం విల్లుపురం-తిరుపతి రైలును తనిఖీ చేశారు. ఎటువంటి అసాధారణమైన వస్తువులు దొరకలేదని చిత్తూరు రైల్వే అధికారులు తెలిపారు.

అర్ధగిరి హుండీ ఆదాయం రూ.9.48 లక్షలు

తవణంపల్లె, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపులో 75 రోజులకు గాను రూ.9,48,149 నగదు లభించినట్లు ఈవో హనుమంతురావు తెలిపారు. కార్యక్రమంలో దుర్గ గుడి ఈవో మునిశేఖర్, గ్రామీణ బ్యాంక్ సిబ్బంది శాంతన్, సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతల్లో హోంగార్డుల సేవలు భేష్

చిత్తూరు అర్బన్, జూన్ 9(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులతో పాటు హోంగార్డులు కీలకంగా పనిచేస్తున్నారని కర్నూలు రేంజ్ హోంగార్డు కమాండెంట్ మహేష్‌కుమార్ చెప్పారు. జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం చిత్తూరులోని ఆర్మ్‌డ్ రిజర్వుడు పోలీసు కార్యాలయం వద్ద హోంగార్డుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. హోంగార్డులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. జిల్లాలో 362 మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, తిరుపతి హోంగార్డు డీఎస్పీ చిరంజీవి, ఆర్ఐ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహాభారత ఉత్సవాలు



ధర్మరాజులు పట్టాభిషేకంలో పాల్గొన్న ఉభయదారు గీత వెంకటరెడ్డి దంపతులు

గంగాధరనెల్లూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెల్లేపల్లెలో నిర్వహిస్తున్న మహాభారతం వార్షికోత్సవాలు ధర్మరాజుల పట్టాభిషేకం పూజలతో ముగిశాయి. ద్రౌపదీ సమేత ధర్మరాజులు ఆలయంలోని గర్భగుడిలో విగ్రహాలకు అభిషేకం పూజలు నిర్వహించారు. అనంతరం ద్రౌపదీ సమేత ధర్మరాజులతో పాటు పాండవుల విగ్రహాలను అలంకరించి అర్చకుల వేదమంత్రాలు, పంబల వాయిద్యాల నడుమ ధర్మరాజుల పట్టాభిషేకం కనుల పండువగా చేశారు. చిన్నమిట్టపల్లె గ్రామానికి చెందిన కామసాని గీత, వెంకటరెడ్డి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. నిర్వాహకులు ప్రసాదరెడ్డి, రవీంద్రారెడ్డి, గంగయ్యయాదవ్, జయరామిరెడ్డి, గుంటూరు దేవరాజులు నాయుడు, యుగంధర్‌రెడ్డి, బాలరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పుష్పపల్లకిపై అమ్మవారి ఊరేగింపు

పూతలపట్టు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రచెరువుపల్లిలో జరుగుతున్న వీరాంజనేయస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పుష్పపల్లకిలో ఊరేగించారు. పుష్పపల్లకిని మొరవపాటూరు, పాటూరు, పొలకల సంతగేటులో ఊరేగించగా, భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

వైభవంగా ముత్యాలమ్మ తిరుణాళ్ల

గంగాధరనెల్లూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోతరంగనపల్లిలో ముత్యామ్మ ఆలయ వార్షిక తిరుణాళ్లను సోమవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం పూజలు చేసిన అనంతరం పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మోతరంనపల్లెలో రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పుష్పపల్లకిలో అధిష్ఠింపజేసి పురవీధుల్లో ఊరేగించారు.

సుస్థిర వ్యవసాయ విధానాలు పాటించండి

పెనుమూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సుస్థిర వ్యవసాయ విధానాలు పాటించడం ద్వారా సాగులో అనవసర ఖర్చు తగ్గించుకొని అధిక ఆదాయం పొందవచ్చని రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ సేద్య విభాగ శాస్త్రవేత్త డాక్టర్ దివ్య తెలిపారు. పెనుమూరు మండలం శాతంబాకం, దాసరపల్లి గ్రామాల్లో రాస్ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. డ్రోన్ల ద్వారా పురుగుమందు పిచికారీ ప్రదర్శన నిర్వహించారు.

తూనికల్లో అవకతవకలకు పాల్పడితే చర్యలు

బంగారుపాళ్యం, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ వ్యవసాయ మార్కెట్ యార్డులో తిరుపతికి చెందిన తూనికలు, కొలతల అధికారి స్వామి, డీఎస్‌వో శేఖర్‌తో కలిసి సోమవారం వేబ్రిడ్జిలను తనిఖీలు చేశారు. ర్యాంప్‌ల వద్ద ఉన్న కాటాలను, మామిడి మండీల్లో కూడా తూనికలను పరిశీలించారు. తూనికల్లో అవకతవకలు జరిగితే జరిమానాలు విధిస్తామని వారు చెప్పారు.

సైకిల్ యాత్రికుడికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



కార్తీక్‌ను అభినందిస్తూ చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): సైకిల్ యాత్రికుడిని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అభినందించి, ఆర్థిక సాయం అందించారు. కడపకు చెందిన సైకిల్ యాత్రికుడు కార్తీక్ ఇటీవల 'సేవ్ ట్రీ - సేవ్ ఎర్త్' నినాదంతో కడప నుంచి రాష్ట్రం మొత్తం తిరగాలని సైకిల్ యాత్ర ప్రారంభించారు. ఇందులో భాగంగా కార్తీక్ సోమవారం చిత్తూరుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కార్తీక్‌ను అభినందించారు. పర్యావరణ పరిరక్షణకు, మొక్కల పెంపకం, పరిరక్షణ, భూ సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సైకిల్ యాత్ర చేయడం అభినందనీయమని చెప్పారు. ఈ సందర్భంగా కార్తీక్‌కు ఎమ్మెల్యే రూ.10 వేల చెక్కు అందజేశారు.

సీడీపీవో బాధ్యతల స్వీకరణ

గంగాధరనెల్లూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవోగా ఆబోతుల పద్మసునంద సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఇంతకు ముందు కార్వేటినగరం ప్రాజెక్ట్‌లో పనిచేస్తూ బదిలీపై గంగాధరనెల్లూరుకు వచ్చారు. గతంలో ఇక్కడ సీడీపీవోగా పనిచేస్తున్న గుండ్లపల్లె వినతశ్రీ బంగారుపాళ్యం ప్రాజెక్ట్‌కు బదిలీపై వెళ్లారు. కొత్తగా విధుల్లో చేరిన పద్మసునందకు కార్యాలయ ఉద్యోగులు స్వాగతం పలికారు.

కార్వేటినగరం సీడీపీవో బదిలీ

వెదురుకుప్పం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో పద్మసునంద గంగాధరనెల్లూరు ఐసీడీఎస్‌కి బదిలీపై వెళ్లారు. ఇక్కడికి శోభారాణి బదిలీపై వచ్చారు.

రోడ్డుప్రమాదంలో ఒకరి మృతి



బాలాజీ మృతదేహం

నగరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని బుగ్గఅగ్రహారం వద్ద సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నారాయణవనం మండలానికి చెందిన దక్షిణ పాలమంగళం గ్రామ నివాసి బాలాజీ(39) అక్కడికక్కడే మృతి చెందాడు. బాలాజీ సోమవారం తమిళనాడుకు చెందిన పుణ్యంకు ద్విచక్ర వాహనంపై వెళ్లి స్వగ్రామమైన దక్షిణ పాలమంగలానికి తిరిగి వెళుతుండగా బుగ్గఅగ్రహారం వద్ద పన్నూరు ఉపకేంద్రం నుంచి నగరికి వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టినట్లు స్థానికులు తెలిపారు. బాలాజీ వ్యవసాయం చేసుకుని జీవించేవాడు. అతడి మృతితో కుటుంబం వీధిన పడ్డట్టయిందని మృతుడి బంధువులు వాపోయారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ విజయ్‌నాయక్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేత్రపర్వంగా అర్జున తపస్సు



తపస్సుమాను అధిరోహిస్తున్న అర్జున వేషధారి

యాదమరి, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా సోమవారం అర్జున తపస్సు పూజా కార్యక్రమం నేత్రపర్వంగా జరిగింది. ఉభయదారులైన కట్టకిందవూరు గ్రామస్తులు బాలాజిరెడ్డి, జయమ్మ, ఆనంద్‌రెడ్డి, గీత ఆధ్వర్యంలో పాండవుల విగ్రహాలను ప్రత్యేకంగా అభిషేకం చేసి, పూజలు నిర్వహించారు. అనంతరం అర్జున వేషధారి తపస్సుమానును పద్యాలు పాడుతూ ఒక్కో మెట్టును అధిరోహించారు. మహిళలు స్నానమాచరించి అంగప్రదక్షిణతో వరపడ్డారు. తపస్సుమాను పైనుంచి అర్జున వేషధారి చల్లిన విభూది, నిమ్మకాయలు దక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. అనంతరం పెరుమాళ్ళపల్లి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

కమనీయం.. ద్రౌపదీ కల్యాణం

వెదురుకుప్పం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం మహాభారత ఉత్సవాల్లో భాగంగా సోమవారం ద్రౌపదీ అమ్మవారి కల్యాణోత్సవం శాస్త్రోక్తం జరిగింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వేదపండితులతో కల్యాణోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

● వెదురుకుప్పం మండలం చెంచుగుడి మహాభారత ఉత్సవాల్లో భాగంగా శాస్త్రోక్తంగా ద్రౌపది అమ్మవారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారిని, ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ ఆవరణంలో ద్రౌపదీ కల్యాణోత్సవాన్ని కమనీయంగా నిర్వహించారు.

యోగాంధ్రపై అవగాహన ర్యాలీ

వెదురుకుప్పం, జూన్ 9(ఆంధ్రజ్యోతి): యోగాంధ్రపై వెదురుకుప్పం మండల కేంద్రంలో ఎంపీడీవో పురుషోత్తం ఆధ్వర్యంలో ర్యాలీ సోమవారం చేపట్టారు. యోగాసనాల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఉద్యోగులు పాల్గొన్నారు.

● కార్వేటినగరంలో ఎంపీడీవో చంద్రమౌళి ఆధ్వర్యంలో యోగాంధ్రపై ఉద్యోగులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. యోగాసనాలపై అవగాహన కల్పించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టి కుటుంబ సభ్యులపై దాడి

● ఐదుగురిపై కేసు నమోదు

పెనుమూరు, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన అనంతరం బాధిత కుటుంబ సభ్యులపైనే తీవ్రంగా దాడి చేసిన ఘటన పెనుమూరు మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రామచంద్రయ్య కథనం మేరకు... సామిరెడ్డిపల్లి పంచాయతీ సింగరాపల్లి గ్రామానికి చెందిన పునీత్ ఆదివారం రాత్రి చిత్తూరు నుంచి ఇంటికి వస్తున్న నేపథ్యంలో వడ్డిగుడిసెల సమీపంలో చిత్తూరు పట్టణానికి చెందిన వెంకటేశ్ ద్విచక్ర వాహనంతో ఢీకొట్టాడు. పునీత్ ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు సంఘటనా స్థలానికి వెళ్లగా, వెంకటేశ్ తన స్నేహితులతో వచ్చి పునీత్ కుటుంబ సభ్యులపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దీంతో బాధితుల ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి, వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.